RNI TEL TEL 2024/89323.

# జన సంఘర్షణ

మా లక్ష్యం సామాన్యుని పక్షం

తెలుగు దినపత్రిక

అక్రమ ప్రాజెక్టులను అడ్డుకోవాలి 2

| నిజామాబాద్ | సంపుటి : 03 | సంచిక : 146 | జూన్ 25 గురువారం 2026 | ఎడిటర్ : రాచమల్లు మాధవి | పేజీలు 08 | వెల : రూ. 6.00 |
|---|---|---|---|---|---|---|
| Nizamabad | Vol: 03 | Vol: 146 | JUN 25 Thursday 2026 | Editor : rachamallu madhavi | Pages 08 | Cost: Rs 6.00 |

# పేదల సంక్షేమమే ధ్యేయం



**హైదరాబాద్ జనసంఘర్షణ**

తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తోందని, ఇందిరమ్మ రాజ్యంలో ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందిస్తామని ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. బుధవారం ఖమ్మం జిల్లా వైరా నియోజకవర్గ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన రైతు ఆశీర్వాద సభ సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో తెలంగాణను అప్పుల రాష్ట్రంగా మార్చారని, ఆనాడు కేసీఆర్ చేసిన అప్పులను తాము ఇప్పుడు వడ్డీలతో సహా చెల్లిస్తున్నామని విమర్శించారు. గతంలో జవహర్‌లాల్ నెహ్రూ, ఇందిరా గాంధీల హయాంలో నిర్మించిన ప్రాజెక్టులు నేటికీ దశాబ్దాలుగా చెక్కుచెదరకుండా ఉంటే, కేసీఆర్ ప్రభుత్వం రూ.లక్ష కోట్లతో కట్టిన కాళేశ్వరం ప్రాజెక్టు కేవలం పదేళ్లలోనే కుంగిపోయిందని దుయ్యబట్టారు. ప్రతిపక్ష బీఆర్ఎస్ నేతలైన తండ్రి, కొడుకు, అల్లుడు, కూతురు (ఆ నలుగురు) మాయమాటలు చెబుతూ రాష్ట్రంపై పడి దుష్ప్రచారం చేస్తున్నారని, వారి మాటలను ప్రజలు ఎట్టి పరిస్థితుల్లోనూ నమ్మవద్దని పిలుపునిచ్చారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన వాగ్దానాలను కాంగ్రెస్ ప్రభుత్వం నిలబెట్టుకుంటోందని, కోటి పది లక్షల కుటుంబాలకు ఉచితంగా సన్నబియ్యం పంపిణీ చేయడంతో పాటు ప్రతి కుటుంబానికి రూ.10 లక్షల ఆరోగ్య బీమా కల్పిస్తున్నామని డిప్యూటీ సీఎం వివరించారు. మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలు, నిరుపేదలకు రూ.22 వేల కోట్లతో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం, మహిళల ఉచిత బస్సు ప్రయాణానికి రూ.13 వేల కోట్లు చెల్లించామని చెప్పారు. వీటితో పాటు రైతు రుణమాఫీ, రైతుభరోసా కింద వేల కోట్ల రూపాయలను చెల్లించామన్నారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ

➢ మిగతా 2వ పేజిలో..

## రేషన్ ఎలా నిరాకరిస్తారు



**న్యూఢిల్లీ జనసంఘర్షణ**

ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ నుండి తొలగించబడిన వారికి రేషన్ నిరాకరిస్తూ పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులను సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌ను సుప్రీంకోర్టు బుధవారం విచారించింది. ఓటర్ల జాబితాలో పేరు తొలగించినంత మాత్రాన రేషన్ ఎలా నిరాకరిస్తారంటూ ఈ సందర్భంగా అత్యున్నత న్యాయస్థానం ఆశ్చర్యం వ్యక్తం చేసింది. అయితే, ఈ వివాదం పూర్తిగా ఒక రాష్ట్ర పరిధిలోని ప్రత్యేక కారణాలతో కూడుకున్న అంశం అయినందున, ఆర్టికల్ 32 కింద నేరుగా సుప్రీంకోర్టును ఆశ్రయించడం సరికాదని ధర్మాసనం అభిప్రాయపడింది. దీనిపై ముందుగా కోల్‌కతా హైకోర్టుకు వెళ్లాల్సిందిగా పిటిషనర్‌కు స్పష్టం చేసింది. న్యాయస్థానం సూచనతో పిటిషనర్ తరఫు న్యాయవాది ఎస్. ప్రసన్న స్పందిస్తూ, సుప్రీంకోర్టులో దాఖలు చేసిన తమ పిటిషన్‌ను ఉపసంహరించుకుని హైకోర్టును ఆశ్రయించేందుకు అనుమతి ఇవ్వాలని కోరారు. ఇందుకు అంగీకరించిన జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ జైమల్య బాగ్చీలతో కూడిన వెకేషన్ బెంచ్.. రేషన్ నిరాకరణ వివాదంపై కోల్‌కతా హైకోర్టులో లీగల్ రెమెడీ పొందేందుకు పిటిషనర్‌కు పూర్తి స్వేచ్ఛనిస్తూ ఈ పిటిషన్‌ను పరిష్కరించింది.

➢ మిగతా 2వ పేజిలో..

## వచ్చే నెల ఇరాన్ మాజీ సుప్రీం లీడర్ అంత్యక్రియలు



**ఇరాన్ జనసంఘర్షణ**

ఇరాన్ మాజీ సుప్రీం లీడర్ దివంగత ఆయతుల్లా అలీ ఖమేనీ అధికారిక అంత్యక్రియల కార్యక్రమాలకు హాజరు కావాల్సిందిగా భారత ప్రధాని నరేంద్ర మోదీకి అధికారిక ఆహ్వానం అందింది. ఈ ఏడాది ఫిబ్రవరి 28న అమెరికా-ఇజ్రాయెల్ జరిపిన ఉమ్మడి వైమానిక దాడుల్లో ఖమేనీ మరణించిన సంగతి తెలిసిందే. అప్పట్లో ప్రాంతీయ ఉద్రిక్తతలు, యుద్ధ వాతావరణం కారణంగా వాయిదా పడిన అంత్యక్రియలను వచ్చే నెలలో అత్యంత ఘనంగా నిర్వహించేందుకు ఇరాన్ ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. ఈ కార్యక్రమానికి రావాలంటూ ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ తరఫున న్యూఢిల్లీలోని ఇరాన్ దౌత్య కార్యాలయం ద్వారా భారత విదేశాంగ శాఖకు మంగళవారం అధికారికంగా ఆహ్వాన పత్రాన్ని పంపారు. జులై 4 నుండి 9వ తేదీ వరకు ఇరాన్ ప్రభుత్వం ఈ అంత్యక్రియల ప్రక్రియను వివిధ నగరాల్లో అధికారికంగా నిర్వహించనుంది. జులై 4, 5 తేదీల్లో టెహ్రాన్‌లోని గ్రాండ్ మొసల్లా కాంప్లెక్స్‌లో ఖమేనీ భౌతికకాయాన్ని ప్రజల సందర్శనార్థం ఉంచనున్నారు. జులై 6న టెహ్రాన్‌లో అంతిమయాత్ర, జులై 7న పవిత్ర నగరం ఖోమ్‌లో ప్రత్యేక నివాళుల కార్యక్రమాలు జరగనున్నాయి. అనంతరం జులై 9న ఖమేనీ స్వస్థలమైన, షియా ముస్లింల పవిత్ర నగరమైన మషాద్‌లోని ఇమామ్ రెజా దర్గా (ష్రైన్) పరిధిలో ఖనన సంస్కారాలు పూర్తి చేయనున్నారు. ఈ చారిత్రాత్మక కార్యక్రమానికి చైనా, రష్యా, ఫ్రాన్స్, ఖతార్, పాకిస్తాన్ వంటి పలు ప్రపంచ దేశాల అధినేతలను, ప్రతినిధి బృందాలను ఇరాన్ ఆహ్వానిస్తోంది. అయితే, ఈ ఆహ్వానంపై

➢ మిగతా 2వ పేజిలో..

## తెలంగాణ అంతటా విస్తరించిన రుతుపవనాలు



**హైదరాబాద్ జనసంఘర్షణ**

తెలంగాణ అంతటా ఎట్టకేలకు నైరుతి రుతుపవనాలు పూర్తిస్థాయిలో విస్తరించడంతో రాష్ట్రవ్యాప్తంగా వానలు ఊపందుకున్నాయి. పసిఫిక్ మహాసముద్రంలో ఏర్పడిన ఉష్ణ పరిస్థితుల కారణంగా ఈ ఏడాది రుతుపవనాల గమనం కాస్త మందకొడిగా సాగింది. జూన్ 8న ఇవి రాష్ట్రాన్ని తాకినప్పటికీ, తెలంగాణ వ్యాప్తంగా పూర్తిగా విస్తరించడానికి దాదాపు 15 రోజుల సమయం పట్టింది. ఈ ఆలస్యం వల్ల నారు వేసుకోవడం ఆలస్యమవుతోందని, వ్యవసాయ పనులు వెనకబడుతున్నాయని రైతులు కొంత ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అయితే, ప్రస్తుత విస్తరణతో సోమవారం నుండి మంగళవారం వరకు పలు జిల్లాల్లో రికార్డు స్థాయి వర్షపాతం నమోదైంది. ముఖ్యంగా పెద్దపల్లి జిల్లా శ్రీరాంపూర్ మండలం కూనారంలో ఈ ఏడాదిలోనే అత్యధికంగా 17.1 సెంటీమీటర్ల భారీ వర్షం కురిసింది. అలాగే హైదరాబాద్ వ్యాప్తంగా భారీ వర్షాలు కురవగా, రంగారెడ్డి జిల్లాలోని మొయినాబాద్, శేరిలింగంపల్లి, రాజేంద్రనగర్, శంషాబాద్ మండలాల్లో వానలు దంచికొట్టాయి. వీటితో పాటు సంగారెడ్డి, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, మంచిర్యాల, జగిత్యాల, ములుగు, ఆదిలాబాద్ జిల్లాల్లో సైతం మంగళవారం పగటిపూట వర్షాలు ఊపందుకున్నాయి.

➢ మిగతా 2వ పేజిలో..

## దిగొచ్చిన బంగారం, వెండి ధరలు

**న్యూఢిల్లీ జనసంఘర్షణ**

బంగారం కొనుగోలు చేయాలనుకునే వారికి స్వల్ప ఉపశమనం లభిస్తూ పసిడి, వెండి ధరలు మెల్లగా దిగివస్తున్నాయి. అంతర్జాతీయ భౌగోళిక రాజకీయ

➢ మిగతా 2వ పేజిలో..



# తెలంగాణ అంతటా విస్తరించిన రుతుపవనాలు

**మొదటిపేజీ తరువాయి●●** రాష్ట్రంలో ఈ వారం రోజుల పాటు వర్షాలు జోరుగా కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. రాబోయే బుధ, గురు, శుక్రవారాల్లో మరిన్ని భారీ వర్షాలు పడతాయని అధికారులు స్పష్టం చేశారు. ఈ నెల 24న జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో వానలు జోరుగా సాగనున్నాయి. ఆ మరుసటి రోజు అంటే 25వ తేదీన ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్, హైదరాబాద్, రంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో వర్ష తీవ్రత ఎక్కువగా ఉండనుంది. ఇక 26వ తేదీన ఈ ప్రాంతాలతో పాటు ఉమ్మడి వరంగల్ జిల్లాలోనూ భారీ వర్షాలు కురుస్తాయని, మిగిలిన జిల్లాల్లో ఓ మోస్తరు వానలు పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు వెల్లడించారు.

# అక్రమ ప్రాజెక్టులను అడ్డుకోవాలి

**మహబూబ్‌నగర్**

తుంగభద్ర జలాల్లో తెలంగాణకు జరుగుతున్న అన్యాయాన్ని నిరసిస్తూ, కర్ణాటక నిర్మిస్తున్న అక్రమ ప్రాజెక్టులను అడ్డుకోవాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి టి. హరీశ్ రావు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఒక బహిరంగ లేఖ రాశారు. తుంగభద్ర నదిపై కర్ణాటక చేపడుతున్న అక్రమ ప్రాజెక్టుల వల్ల ఉమ్మడి మహబూబ్‌నగర్ (పాలమూరు) జిల్లా మళ్లీ ఎడారిగా మారే ప్రమాదం ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. సమైక్య పాలనలో జరిగిన నీళ్ల దోపిడీకి వ్యతిరేకంగా పోరాడే తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకున్నామని, గత బీఆర్ఎస్ ప్రభుత్వం గోదావరి, కృష్ణా జలాలను మళ్లించి పాలమూరు వలసల జిల్లాను పచ్చని పంటలతో కళకళలాడేలా చేసిందని గుర్తుచేశారు. అయితే ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్ర ప్రయోజనాలను పక్క రాష్ట్రాల వద్ద తాకట్టు పెట్టే ప్రమాదకరమైన విధానాలను అవలంబిస్తోందని ఆయన విమర్శించారు.

నదుల అనుసంధానం పేరుతో గోదావరి జలాలను మళ్లించే ఆంధ్రప్రదేశ్‌కు పూర్తి సహకారం అందిస్తున్న సీఎం రేవంత్ రెడ్డి, ఇప్పుడు తుంగభద్రపై కర్ణాటక ప్రభుత్వం చేపడుతున్న అక్రమ ప్రాజెక్టుల విషయంలో కూడా అదే ద్రోహ బుద్ధితో వ్యవహరిస్తున్నారని హరీశ్ రావు మండిపడ్డారు. పాలమూరు బిడ్డనని చెప్పుకునే ముఖ్యమంత్రి, అదే ప్రాంత రైతాంగ భవిష్యత్తును ప్రమాదంలోకి నెట్టడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. తుంగభద్రపై కర్ణాటక నిర్మిస్తున్న కురిడి, చిక్కాలపర్వి, చిక్కాలమంచి బ్రిడ్జ్-కమ్-బ్యారేజీలకు కాంగ్రెస్ ప్రభుత్వం పరోక్షంగా సమ్మతి తెలిపిందా అని నిలదీశారు. గతంలో కొడంగల్ లిఫ్ట్‌కు కర్ణాటక ఎన్‌వోసీ (చీూజ) ఇవ్వడం వెనుక జరిగిన మతలబు ఏమిటని, ఏడాది కాలంగా కర్ణాటక అక్రమ నిర్మాణాలపై ఎందుకు అభ్యంతరం చెప్పలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.

రాజోలిబండ డైవర్షన్ స్కీమ్ (ఆర్డీఎస్)కు కేవలం 100 మీటర్ల ఎగువన రాయచూర్ జిల్లాలో 2 టీఎంసీల నీటిని తరలించేలా రూ.85 కోట్లతో కర్ణాటక అక్రమంగా కురిడి ఎత్తిపోతల పథకాన్ని నిర్మిస్తోందని, ఇప్పటికే 60 శాతం ఇన్టేక్ నిర్మాణాలు పూర్తయినా ప్రభుత్వం మొద్దునిద్ర పోతోందని ధ్వజమెత్తారు. సెంట్రల్ వాటర్ కమిషన్ (జఔజ), కృష్ణా రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు (ఖ=వీదీ) అనుమతులు లేకుండానే ఇష్టారాజ్యంగా ప్రాజెక్టులు కడుతుంటే ఎందుకు లేఖ రాయలేదని ప్రశ్నించారు. ఆర్డీఎస్‌లో కర్ణాటక వాటా 1.2 టీఎంసీ మాత్రమే ఉన్నప్పటికీ, వారు సగటున 5 టీఎంసీలు వాడుకుంటున్నారని.. ఇప్పుడు కొత్త ప్రాజెక్టులు పూర్తయితే ఆర్డీఎస్‌తో పాటు తుమ్మిళ్ల భవిష్యత్తు కూడా ప్రశ్నార్థకంగా మారుతుందని హెచ్చరించారు.

చివరి దశలో ఉన్న పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు పనులను పూర్తి చేస్తే గ్రావిటీ ద్వారా నారాయణపేట, కొడంగల్‌కు నీళ్లు వచ్చే అవకాశం ఉన్నప్పటికీ, కమీషన్ల కోసం కొడంగల్ లిఫ్ట్ పేరిట భీమా ప్రాజెక్టు ఆయకట్టు రైతుల ప్రయోజనాలను దెబ్బతీశారని విమర్శించారు. భీమా ప్రాజెక్టుకు ఉన్న 16.94 టీఎంసీల కేటాయింపులో సుమారు 7 టీఎంసీలను కొడంగల్ లిఫ్టుకు మళ్లించి, రెండు లక్షల ఎకరాలకు నీళ్లు అందించే భీమాను నిర్వీర్యం చేశారని ఆరోపించారు. కర్ణాటక అక్రమ ప్రాజెక్టుల వల్ల తుంగభద్ర నుండి శ్రీశైలానికి వచ్చే ప్రవాహాలు తగ్గి, కల్వకుర్తి, పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టులతో పాటు ఉమ్మడి జిల్లా తాగునీటి అవసరాలు దెబ్బతింటాయన్నారు. తమ జల హక్కుల కోసం ప్రజలను మరోసారి రోడ్డుపైకి తెచ్చే పరిస్థితి రానివ్వద్దని, స్వార్థ రాజకీయాల కోసం రాష్ట్ర ప్రయోజనాలను తాకట్టు పెడితే బీఆర్ఎస్ ఊరుకోదని, పాలమూరు

# పేదల సంక్షేమమే ధ్యేయం

**మొదటిపేజీ తరువాయి..** ప్రక్రియ ద్వారా కొన్ని చోట్ల వేలాది ఓట్లు తొలగించబడుతున్నాయని, ఇది ప్రమాదకరమైన అంశమని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ బూత్ లెవెల్ ఏజెంట్లు (దీూా), కార్యకర్తలు ఓటు హక్కుపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ అప్రమత్తంగా ఉండాలని, అర్హులైన ప్రతి ఒక్కరి ఓటును కాపాడాలని సూచించారు. జూన్ 30వ తేదీన మధిర నియోజకవర్గం చింతకాని మండలం జగన్నాథపురంలో నిర్వహించబోయే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 'రైతు ఆశీర్వాద సభ'ను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ, తమ ప్రభుత్వం రైతు భరోసా కింద రూ.36 వేల కోట్లు అందించి రైతు పక్షపాతిగా నిలిచిందని కొనియాడారు. రైతులు పండించిన వరి, మొక్కజొన్న పంటలకు గిట్టుబాటు ధర కల్పించి ఆదుకోవడమే కాకుండా, కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి రాష్ట్రానికి అవసరమైన ఎరువులను సకాలంలో సరఫరా చేశామన్నారు. రైతులను ఆదుకోవడంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మండిపడ్డారు. జూన్ 30న జరిగే భారీ బహిరంగ సభ నుండే రాష్ట్రవ్యాప్తంగా రైతుల ఖాతాల్లోకి ఒకే క్లిక్‌తో నిధులు విడుదల కానున్నాయని, కాబట్టి ఈ సభను చారిత్రాత్మకంగా విజయవంతం చేయాలని కోరారు. ఈ సన్నాహక సమావేశంలో వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాసు నాయక్, రాష్ట్ర కళల సంస్థ చైర్మన్ నాయుడు సత్యనారాయణ, గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, జిల్లా అధ్యక్షుడు నూత సత్యనారాయణ, సుడా చైర్మన్ పువ్వాళ్ల దుర్గా ప్రసాద్ తదితర ముఖ్య నేతలు పాల్గొన్నారు.

# సిద్దిపేటలో ఒలంపిక్ రన్

**సిద్దిపేట**

సిద్దిపేట పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో బుధవారం నిర్వహించిన 'ఒలింపిక్ రన్' ప్రారంభోత్సవ కార్యక్రమంలో మెదక్ బీజేపీ ఎంపీ రఘునందన్ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమాజానికి చేటు తెస్తున్న డ్రగ్స్ నిషేధానికి ప్రతి ఒక్కరూ నడుం బిగించాలని పిలుపునిచ్చారు. 'నశా ముక్త్ భారత్' కార్యక్రమంలో భాగంగా, ప్రతి ఏటా జూన్ 23న జరుపుకునే ఒలింపిక్ డేను పురస్కరించుకుని ఈ ర్యాలీని చేపట్టినట్లు పేర్కొన్నారు. రన్‌లో పాల్గొన్న విద్యార్థులకు, యువతకు ఒలింపిక్ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. నేటి కాలంలో తల్లిదండ్రులు తమ పిల్లలను ఎండలోకి పంపేందుకు ఇష్టపడటం లేదని, డీ విటమిన్ కోసం టాబ్లెట్లు వాడుతున్నారే తప్ప సహజమైన ఎండలో ఉంచడం లేదని ఆయన వ్యాఖ్యానించారు. శారీరక, మానసిక ఉల్లాసానికి యోగా ఎంతో మేలు చేస్తుందని, ప్రతి ఒక్కరూ దీనిని అలవాటు చేసుకోవాలని సూచించారు. పాఠశాల యాజమాన్యాలు కూడా విద్యార్థులకు తప్పనిసరిగా యోగా నేర్పించాలని కోరారు.

తమ చిన్నతనంలో ఒలింపిక్స్ క్రీడలను చూసినప్పుడు భారతదేశానికి ఎన్ని కప్పులు వస్తాయా అని ఆశగా ఎదురుచూసేవాళ్లమని, అప్పట్లో చైనా మొదటి స్థానంలో ఉంటే మనం కింది స్థానాల్లో ఉండేవాళ్లమని ఎంపీ గుర్తుచేసుకున్నారు. అయితే నరేంద్ర మోదీ ప్రధాని అయిన తర్వాత దేశంలో క్రీడలకు పెద్దపీట వేస్తూ, క్రీడాకారులను ఎంతగానో ప్రోత్సహిస్తున్నారని కొనియాడారు. స్వామి వివేకానంద చెప్పినట్లుగా నేడు దేశానికి కేవలం భగవద్గీత పుస్తకాలు మాత్రమే కాదు, అంతకంటే మిన్నగా క్రీడా మైదానాలు కూడా ఎంతో అవసరమని పేర్కొన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను చదువుతో పాటు ఆటల వైపు కూడా మళ్లించాలని, దేశంలోని ప్రతిభావంతులైన క్రీడాకారులను స్ఫూర్తిగా తీసుకుని యువత ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. సిద్దిపేట యువతకు ఇంత పెద్ద మైదానం అందుబాటులో ఉండటం ఒక గొప్ప అవకాశమని, విద్యార్థులంతా క్రీడలకు ప్రాధాన్యత ఇస్తూ ఈ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీ రఘునందన్ రావు ఆకాంక్షించారు.

## వ్యవసాయ మార్కెట్ కమిటీ ప్రారంభం

కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్, ఎమ్మెల్యేలు

**కొమరం భీమ్ ఆసిఫాబాద్, :** జైనూ మండల కేంద్రంలో రూ.1.25 కోట్ల తో నిర్మించిన వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయం, 12 సముదాయ భవనాలను జిల్లా కలెక్టర్ కె. హరిత, ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ ప్రారంభించారు. అనంతరం ఈజీఎస్ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు మాట్లాడుతూ మార్కెట్ కమిటీ కార్యాలయంతో పాటు 12 సముదాయ గదుల నిర్మాణం ద్వారా కమిటీకి ఆదాయం సమకూరుతుందని తెలిపారు. రైతులు వ్యవసాయ సాగులో రసాయనిక ఎరువుల వినియోగాన్ని తగ్గించి సేంద్రియ ఎరువులపై దృష్టి సారించాలని సూచించారు. విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసే సమయంలో తప్పనిసరిగా అసలు రసీదులు తీసుకుని పంట కాలం ముగిసే వరకు భద్రపరచుకోవాలని సూచించారు. నకిలీ విత్తనాల నియంత్రణకు వ్యవసాయ శాఖ అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేపట్టి రైతులకు అవగాహన కల్పించాలని ఎమ్మెల్యేలు కోరారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ కుడిమెత విశ్వనాథ్ రావు, వైస్ చైర్మన్ బానోత్ జైవంత్ రావు, జిల్లా వ్యవసాయ అధికారి వెంకట్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కామెడె అనిల్, జిల్లా మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ కనక యాదవ్ రావు, ఎంపీడీవో సుధాకర్ రెడ్డి, తహసీల్దార్ ఆడ బిర్షవ్, మార్కెట్ కమిటీ కార్యదర్శి ఇర్ఫాన్ అహ్మద్ ఖాన్, ప్రజా ప్రతినిధులు, అధికారులు, రైతులు, వివిధ గ్రామ పంచాయతీల సర్పంచులు నాయకులు పాల్గొన్నారు.

# వచ్చే నెల ఇరాన్ మాజీ సుప్రీం లీడర్ అంత్యక్రియలు

**మొదటిపేజీ తరువాయి..** భారత ప్రభుత్వం ఇంకా ఎలాంటి అధికారిక నిర్ణయాన్ని ప్రకటించలేదు. జులై మొదటి వారంలో ప్రధాని మోదీకి ముందుగానే ఖరారైన ఇతర విదేశీ పర్యటనలు (ఇండోనేషియా, ఆస్ట్రేలియా తదితర దేశాలు) ఉన్న నేపథ్యంలో.. ఈ అంత్యక్రియలకు ఆయనే స్వయంగా హాజరవుతారా లేక భారతదేశం తరఫున ఒక ఉన్నత స్థాయి ప్రత్యేక ప్రతినిధి బృందాన్ని ఇరాన్‌కు పంపుతారా అనే అంశంపై దౌత్య వర్గాల్లో తీవ్ర చర్చ జరుగుతోంది. భారత్-ఇరాన్ దేశాల మధ్య ఇంధన రంగం, ద్వైపాక్షిక వాణిజ్యం, ప్రాంతీయ భద్రతతో పాటు వ్యూహాత్మక చాబహార్ నౌకాశ్రయం వంటి కీలక అంశాల్లో బలమైన సహకారం కొనసాగుతుండటంతో భారత ప్రాతినిధ్యంపై అందరిలోనూ ఆసక్తి నెలకొంది.

# దిగొచ్చిన బంగారం, వెండి ధరలు

**మొదటిపేజీ తరువాయి..** పరిణామాలు, అమెరికా డాలర్ బలపడడం, అక్కడి బాండ్ రాబడులు పెరగడం జంట్ప వివిధ కారణాల జుల్ల గ్లోబ్ద్ జుూర్కెట్ద్లో పణిడిక్చ డిజుూండ్ కాణఖి తగ్గింది. దీని ప్రపఖీాజుం ధ్రాజీ జుూర్కెట్లపై కూడా ఙప్టోంగా కనిపిఖళఖింది. ప్రజుుఖ్ప్రఖ్ఞైట్ గుడ్ రిట్ఠ్న్ ణజుూచాళం ప్రకాళం, బుదోళం ఉదజీం ణజుజీూనిక్చ హైదూఖాద్, విజజోూడ ళుగూ్డో 24 క్యారెట్ల 10 ప్రాజుుల (తులం) ఙప్చ్స్టూ బంగారం ధర రూ.1,44,330 వద్ద కొనసాగుతోంది. అదేవిధంగా, ఆభరణాల తయారీకి ఉపయోగించే 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,32,300గా నమోదైంది. కేవలం బంగారం మాత్రమే కాకుండా వెండి ధరలు కూడా తగ్గుముఖం పట్టాయి. ప్రస్తుతం హైదరాబాద్, విజయవాడల్లో కిలో వెండి ధర రూ.2,40,000 వద్ద అందుబాటులో ఉంది. అంతర్జాతీయ మార్కెట్ ఒడిదుడుకులు, దేశీయ డిమాండ్‌ను బట్టి ఈ ధరల్లో రోజూ మార్పులు ఉండే అవకాశం ఉందని మార్కెట్ నిపుణులు పేర్కొంటున్నారు.

## ముంబైలో భారీ వర్షాలు

నైరుతి రుతుపవనాల రాకతో ముంబై నగరంలో మంగళవారం నుండి భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఈ నేపథ్యంలో నగరంలోని వర్ష పరిస్థితులను స్వయంగా పరిశీలించేందుకు బుధవారం ఉదయం ముంబై మేయర్ రీతూ తావ్డే క్షేత్రస్థాయి పర్యటనకు వచ్చారు. దాదర్, హింద్‌మాతా, గాంధీ మార్కెట్ వంటి అత్యధికంగా నీరు నిలిచే ప్రాంతాల్లో ఆమె పర్యటించి అధికారులతో సమీక్ష జరిపారు. అయితే మేయర్ రీతూ తావ్డే ఫుట్‌పాత్‌పై నిలబడి అధికారులతో మాట్లాడుతుండగానే ఆమె కళ్ల ముందే ఒక ఊహించని ప్రమాదం చోటుచేసుకుంది. రోడ్డుపై వెళ్తున్న ఒక వ్యక్తి అక్కడ తెరిచి ఉన్న మ్యాన్‌హోల్‌ను గమనించకుండా నేరుగా అందులో పడిపోయాడు. వర్షపు నీరు, డ్రైనేజీ నీరు రోడ్డుపై పూర్తిగా నిలిచిపోవడంతో అతడు ఆ మ్యాన్‌హోల్‌ను గుర్తించలేకపోయాడు.

ఈ ప్రవదాన్ని చూసిన వెంటనే మేయర్ వెంట ఉన్న భద్రతా సిబ్బంది, మున్సిపల్ అధికారులు తక్షణమే స్పందించి, అతడిని క్షేమంగా బయటకు తీశారు. మ్యాన్‌హోల్‌లో పడిపోయిన సదరు వ్యక్తిని బృహన్ముంబై మున్సిపల్ కార్పొరేషన్ (దీవీజ) లో పనిచేసే పారిశుద్ధ్య కార్మికుడిగా గుర్తించారు. ఈ ఘటనపై మేయర్ రీతూ తావ్డే అధికారులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వర్షాల సమయంలో మ్యాన్‌హోల్స్ తెరిచి ఉంచితే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ.. డ్రైనేజీ లైన్ శుభ్రం చేయడం కోసమే ఆ మ్యాన్‌హోల్ మూతను తీశారని, దాని చుట్టూ ముందస్తు హెచ్చరిక బోర్డులను కూడా ఏర్పాటు చేశారని వివరించారు. రోడ్లపై నడిచేటప్పుడు ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండాలని, బీఎంసీ ఏర్పాటు చేసే హెచ్చరిక బోర్డులను, సూచనలను గమనిస్తూ జాగ్రత్తలు వహించాలని మేయర్ కోరారు. కాగా, మేయర్ సమీక్ష నిర్వహిస్తుండగా ఆమె కళ్ల ముందే వ్యక్తి మ్యాన్‌హోల్‌లో పడిపోయిన ఈ దృశ్యాలకు సంబంధించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతోంది.

# ఓటరు జాబితా రూపకల్పనలో అర్హులైన ప్రతి పౌరుడు భాగస్వాములు కావాలి..

- స్వేచ్ఛాయుత, నిష్పక్షపాతంగా ఎన్నికల నిర్వహణకు అర్హులైన ప్రతి ఒక్కరు ఓటరుగా నమోదు చేసుకోవాలి.
- ఎస్ ఐ ఆర్ -2026 పై ప్రజల్లో పూర్తి అవగాహన కలిగిఉంచాలి.
- డ్రగ్స్ రహిత సమాజానికి ప్రతి ఒక్కరు బాధ్యతగా కృషి చేయాలి.
- జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్.

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి జూన్ 24 (జన సంఘర్షణ)

ప్రజాస్వామ్య వ్యవస్థకు ఓటు హక్కు ఒక వజ్రాఆయుధంలాంటిదని, స్వేచ్ఛాయుత, నిష్పక్షపాతంగా ఎన్నికలు నిర్వహణకు ఓటరు జాబితాను మరింత సమగ్రంగా ,పారదర్శకమైనదిగా రూపొందించుటకు భారత ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ కార్యక్రమం (ఎస్ఐఆర్–2026)లో అర్హులైన ప్రతి పౌరుడు భాగస్వాములు కావాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ప్రతిమా సింగ్ పిలుపునిచ్చారు.ఎస్ఐఆర్–2026పై ఓటర్లలో అవగాహన కల్పించేందుకు గాను జిల్లా ఎన్నికల యంత్రాంగం ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన 2కె రన్‌ను మెదక్ జిల్లా కేంద్రంలోని. ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల మైదానం వద్ద జిల్లా కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. అక్కడి నుంచి రాందాస్ చౌరస్తా వరకు వరకు ర్యాలీ ఉత్సాహంగా కొనసాగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రజాస్వామ్య వ్యవస్థ లో ఓటరు జాబితా ఖచ్చితత్వంపై ఆధారపడి ఉంటుందని, ఎన్నికల సంఘం చేపట్టిన ఈ ప్రత్యేక కార్యక్రమాన్ని అర్హులైన ప్రతి ఓటరు తమ ఓటు హక్కును నమోదుచేసుకోవానలన్నారు.అలాగే ఇప్పటికే నమోదు చేసుకున్న పౌరులు https://voters.eci.gov.in లో తమ పేర్లను తనిఖీ చేసుకోవచ్చునని, అవసరమైతే సవరణలు, మార్పులు, చేర్పులు చేసుకోనుటకు సహాయం కోసం బూత్ లెవెల్ అధికారులను సంప్రదించవచ్చని అన్నారు. పారదర్శకమైన, సమగ్రమైన, తప్పులులేని ఓటరు జాబితా రూపకల్పనలో ప్రజల భాగస్వామ్యం ఎంతో అవసరమని, మరణించిన వ్యక్తుల పేర్లు, శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు మారిన వారి వివరాలు, ఒకటి కంటే ఎక్కువ చోట్ల నమోదైన డూప్లికేట్ ఓట్లను గుర్తించి తొలగించేందుకు (సర్) కార్యక్రమం ఉపయోగపడుతుందని తెలిపారు. ఎన్నికల సంఘం నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం జూన్ 25 నుంచి జూలై 24 వరకు బూత్ లెవల్ అధికారులు (బీఎల్ఓలు) ఇంటింటికీ వెళ్లి ఎన్‌మరేషన్ ఫారాలను పంపిణీ చేస్తారని తెలిపారు. ఈ ప్రక్రియలో ప్రజలు పూర్తి సహకారం అందించాలని కోరారు. మృతిచెందిన వ్యక్తుల పేర్లు, ఒకటి కంటే ఎక్కువ చోట్ల నమోదైన డూప్లికేట్ ఓట్లను గుర్తించి తొలగించడం ద్వారా మరింత ఖచ్చితమైన ఓటరు జాబితా ను రూపకల్పన చేసేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతుందని,ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు అర్హత కలిగిన ప్రతి భారతీయ పౌరుడికి ఓటు హక్కు కల్పించడమే ముఖ్యలక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. అర్హులైన ఏ ఒక్క ఓటరు కూడా జాబితా నుంచి తొలగిపోకుండా ఎన్నికల సంఘం అన్ని జాగ్రత్తలు తీసుకుంటోందని అన్నారు. ఓటర్ల నమోదు, సవరణలు, అభ్యంతరాలు, క్లెయిమ్స్‌కు సంబంధించిన వివరాలను సంబంధించి బూత్ లెవెల్ అధికారులను సంప్రదించవచ్చి తెలుసుకోవచ్చని పేర్కొన్నారు. అర్హులకు ఓటు హక్కు కల్పించడం ఎంత ముఖ్యమో అనర్హులను ఓజరు జాబితా నుండి తొలగించడం కూడా అంతే ముఖ్యమని అన్నారు. డ్రగ్స్ రహిత సమాజానికి ప్రతి ఒక్కరు పాటుపడాలని యువత చెడు వ్యసనాలకు బానిసలు కాకుండా సత్ప్రవర్తనతో మెలిగి ప్రజాస్వామ్యంలో ఉత్తమ పౌరులుగా ఆదర్శంగా నిలవాలన్నారు. జిల్లా అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్ మాట్లాడుతూ.. సర్‌లో ప్రజలందరి భాగస్వామ్యం అవసరం అన్నారు.




సర్ కార్యక్రమం వల్ల నకిలీ ఓట్లు తొలిగిపోతాయన్నారు. యువత మత్తు పదార్థాలపై అవగాహన కల్గి ఉండాలన్నారు. యువత ఉన్నత లక్ష్యాల వైపు దృష్టి సారించాలని విద్యార్థులకు సూచించారు. మున్సిపల్ చైర్ పర్సన్ రాధిక భూపతి రాజ్ మాట్లాడుతూ.. బలమైన ప్రజాస్వామ్య వ్యవస్థకు సర్ దోహదపడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో 18 సంవత్సరాల నుండి యువతీ యువకులు అందరూ ఓటరుగా నమోదు చేసుకొని, మరణించిన వారిని, రెండుసార్లు ఓటరుగా నమోదైన వారిని తొలగించే ప్రక్రియని ఆమె తెలియజేశారు. అనంతరం జిల్లాను డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యంగా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సెల్ఫీ పాయింట్ లో కలెక్టర్ అదనపు ఎస్పీ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మెదక్ ఆర్డిఓ రమాదేవి, తాహసిల్దార్ లక్ష్మణ్ బాబు, ఎలక్షన్ సూపరింటెంట్ గఫార్, ఆర్ అండ్ బి ఈ.ఈ వేణు, జిల్లా పౌర సంబంధాల అధికారి రామచంద్ర రాజు, డీఎస్పీ ప్రసన్నకుమార్, జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి,వార్డు కౌన్సిలర్లు, ప్రజా ప్రతినిధులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# రాహుల్ గాంధీ ప్రారంభించిన చాత్రోన్ కి గూంజ్ విజయవంతం కావాలి..

- మెదక్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఆంజనేయులు గౌడ్ అన్నారు.

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి జూన్ 24: (జన సంఘర్షణ)

మెదక్ జిల్లా నర్సాపూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల (పెద్ద చింతకుంట) వద్ద ఏఐసీసీ, టీపీసీసీ ఆదేశాల మేరకు పార్లమెంట్‌లో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ ప్రారంభించిన 'ఛాత్రోన్ కి గూంజ్' ఉద్యమానికి మద్దతు ర్యాలీ, నిరసన కార్యక్రమం నిర్వహించిన మెదక్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. దేశంలో పెరుగుతున్న నిరుద్యోగం, తరచూ జరుగుతున్న ప్రశ్నాపత్రాల లీకేజీలు, నియామక ప్రక్రియల్లో జాప్యాలు లక్షలాది మంది విద్యార్థులు, ఉద్యోగార్థుల భవిష్యత్తును అంధకారంలోకి నెట్టివేస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. నీట్ (నీట్) పరీక్ష పేపర్ లీకేజీ వ్యవహారం దేశవ్యాప్తంగా విద్యార్థుల భవిష్యత్తును ప్రశ్నార్థకం చేసిందని విమర్శించారు.





లక్షలాది మంది విద్యార్థులు కష్టపడి పరీక్షలకు సిద్ధమవుతుంటే, పేపర్ లీకేజీల కారణంగా వారి శ్రమ వృథా అవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తక్షణమే రాజీనామా చేయాలి డిమాండ్ చేశారు. ప్రతి ఏడాది రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చిన బీజేపీ ప్రభుత్వం ఆ హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని విమర్శించారు. దేశంలో నిరుద్యోగ సమస్య రోజురోజుకు పెరుగుతున్నప్పటికీ ఉద్యోగాల భర్తీపై స్పష్టమైన విధానాన్ని అమలు చేయడం లేదని ఆరోపించారు. యువత గొంతుకే దేశ భవిష్యత్తు – ఛాత్రోన్ కి గూంజ్ విజయవంతం కావాలి అని అన్నారు. ఈ కార్యక్రమంలో నర్సాపూర్ బ్లాక్ అధ్యక్షుడు రిజ్వాన్, మెదక్ జిల్లా కార్యదర్శి రవీందర్ యాదవ్, నర్సాపూర్ మండల మైనారిటీ సెల్ అధ్యక్షులు అజ్మాత్, నర్సాపూర్ మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు విజయ్ కుమార్, సర్పంచులు పద్మావతి అశోక్ గౌడ్, ఉదయ్ కుమార్, నాయకుడు పాషా, సుధీర్ కుమార్ గౌడ్, నరేష్,సురేష్ గౌడ్, మోహన్ దాస్ గౌడ్, యూత్ కాంగ్రెస్ నాయకులు, ఎన్ ఎస్ యు ఐ నాయకులు, అనుబంధ సంఘాల నాయకులు, విద్యార్థులు తదితరులు పాల్గొనారు.

# క్రీడలతో శారీరక, మానసిక వికాసం

- ఆరోగ్యవంతమైన యువతతోనే దేశాభివృద్ధి: అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్.
- డ్రగ్స్ బారినపడిన వారిని బాధితులుగానే చూస్తున్నాం.
- పునరావాస కేంద్రాల ద్వారా సాధారణ జీవితంలోకి తీసుకొస్తున్నాం.
- డ్రగ్స్ అవగాహన వన్‌డే క్రికెట్ టోర్నమెంట్ విజేతలకు బహుమతుల ప్రదానం.

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి జూన్ 24: (జన సంఘర్షణ)

మెదక్ జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో యువతలో డ్రగ్స్ దుష్ప్రభావాలపై అవగాహన కల్పిస్తూ, వారిని క్రీడల వైపు ప్రోత్సహించే లక్ష్యంతో నిర్వహించిన వన్‌డే క్రికెట్ టోర్నమెంట్ బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమం బుధవారం మెదక్‌లోని జూనియర్ కళాశాల గ్రౌండ్‌లో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మెదక్ జిల్లా అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్, విజేతలకు ట్రోఫీలు,నగదు బహుమతులు ప్రదానం చేశారు.టోర్నమెంట్‌లో రాయల్ వారియర్స్ జట్టు ప్రథమ విజేతగా నిలిచి రూ.5,000 నగదు బహుమతి, ట్రోఫీని అందుకోగా, రాయల్ ఆవుసులపల్లి జట్టు ద్వితీయ విజేతగా నిలిచి రూ.2,500 నగదు బహుమతి, ట్రోఫీని అందుకుంది. విజేతలు, రన్నరప్ జట్లను అదనపు



ఎస్పీ అభినందించి, టోర్నమెంట్‌లో పాల్గొన్న అన్ని జట్ల క్రీడాస్ఫూర్తిని ప్రశంసించారు. ఈ సందర్భంగా అదనపు ఎస్పీ మాట్లాడుతూ యువత తమ విలువైన సమయాన్ని క్రీడలు, విద్య, నైపుణ్యాభివృద్ధి వంటి సానుకూల కార్యక్రమాలకు కేటాయించాలని,డ్రగ్స్ వంటి మాదకద్రవ్యాలకు పూర్తిగా దూరంగా ఉండాలని సూచించారు.క్రీడలు శారీరక దృఢత్వాన్ని పెంపొందించడమే కాకుండా క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, జట్టుగా పనిచేసే తత్వాన్ని, నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాయని అన్నారు. ఆరోగ్యవంతమైన యువతతోనే బలమైన సమాజం, అభివృద్ధి చెందిన దేశం నిర్మితమవుతుంది. అందుకే ప్రతి యువకుడు వ్యసనాలకు దూరంగా ఉంటూ క్రీడలను జీవితంలో భాగం చేసుకోవాలి" అని పేర్కొన్నారు.డ్రగ్స్‌కు అలవాటు పడిన యువతను నేరస్థులుగా కాకుండా బాధితులుగా పరిగణిస్తూ, వారికి కౌన్సెలింగ్ అందించి డీ–అడిక్షన్, పునరావాస (రెహాబిలిటేషన్) కేంద్రాలకు తరలించడం ద్వారా తిరిగి సాధారణ జనజీవన స్రవంతిలో కలిసేలా జిల్లా పోలీస్ శాఖ చర్యలు చేపడుతోందని తెలిపారు. వ్యసనాల నుంచి బయటపడాలనే సంకల్పం ఉన్న వారికి పోలీస్ శాఖ అన్ని విధాలుగా సహకరిస్తుందని, కుటుంబ సభ్యులు కూడా అలాంటి వారిని నిర్లక్ష్యం చేయకుండా చికిత్స, పునరావాసం పొందేలా అండగా నిలవాలని సూచించారు.మాదకద్రవ్యాల నిర్మూలనలో ప్రజల భాగస్వామ్యం అత్యంత కీలకమని, డ్రగ్స్ విక్రయం, వినియోగం లేదా అక్రమ రవాణాకు సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు తెలియజేయాలని కోరారు. సమాచారం అందించిన వారి వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచుతామని స్పష్టం చేశారు. అనంతరం యువతతో కలిసి డ్రగ్స్ వ్యతిరేక ప్రతిజ్ఞ చేయించారు.ఈ కార్యక్రమంలో మెదక్ డీఎస్పీ ప్రసన్న కుమార్, మెదక్ టౌన్ ఇన్‌స్పెక్టర్ మహేష్, పోలీసు అధికారులు, టోర్నమెంట్ నిర్వాహకులు, యువత,క్రీడాకారులు, క్రీడాభిమానులు,స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# కంఠరెడ్డి తిరుపతిరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన బీఆర్ఎస్ కౌన్సిలర్లు

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి జూన్ 24: (జన సంఘర్షణ)



మెదక్ జిల్లా బీఆర్ఎస్ నాయకుడు కంఠరెడ్డి తిరుపతిరెడ్డిని పార్టీ మున్సిపల్ కౌన్సిలర్లు బట్టి ఉదయ్, దీపక్ కుమార్, జుబేర్ మహమ్మద్ సోహెల్, మాజీ కౌన్సిలర్ మాయ మల్లేశం, నాయకుడు ఇందాద్ సాయి తదితరులు ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కంఠరెడ్డి తిరుపతిరెడ్డి మాట్లాడుతూ..మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు సూచనలు, సలహాల మేరకు మెదక్‌లో బీఆర్ఎస్ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని తెలిపారు. బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలే పార్టీకి వెన్నెముక అని పేర్కొన్న ఆయన, నాయకులు, కౌన్సిలర్లకు ఎలాంటి అవసరం వచ్చినా తన సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని హామీ ఇచ్చారు. పార్టీ శ్రేణుల సంక్షేమం, సంస్థాగత బలోపేతం కోసం ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగుతామని తెలిపారు. పార్టీ శ్రేణులు ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కౌన్సిలర్లకు సూచించారు.అనంతరం కౌన్సిలర్లు, నాయకులను శాలువాలతో ఘనంగా సన్మానించి అభినందించారు.

# కాంగ్రెస్ పార్టీ నాయకుడు లీలా గ్రూప్ చైర్మన్ డాక్టర్ మోహన్ నాయక్ నియోజకవర్గానికి రాక

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి జూన్ 24 (జన సంఘర్షణ)



కాంగ్రెస్ పార్టీ నాయకుడు, విలువ చైర్మన్ డాక్టర్ మోహన్ నాయక్ నేడు 25 న 11 గంటలకు హవేలీ ఘన్పూర్ విచ్చేస్తున్నారు. 11:15 నిమిషాలకు హవేలీ ఘన్పూర్ మండల కేంద్రానికి చెందిన రాజ్యలక్ష్మి అనారోగ్య కారణంతో మరణించారు. వారి కుటుంబాన్ని కలిసి పరామర్శించి ఆర్థిక సహాయం అందిస్తారు. 11:45 నిమిషాలకు హవేలీ ఘన్పూర్ మండలం గాజిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన తులసిరామ్ అనారోగ్య కారణంతో మరణించారు వారి కుటుంబాన్ని కలిసి పరామర్శించి ఆర్థిక సహాయం అందిస్తారు.12:30 నిమిషాలకు మెదక్ మండలం మక్త భూపతిపూర్ గ్రామానికి చెందిన కవిత–లక్ష్మీనారాయణ చారి కూతురు మహేశ్వరిలి వివాహానికి హాజరై పుస్తె మట్టెలు అందజేస్తారు.

# పాఠశాలలో నెమలిని రక్షించిన విద్యార్థులు, సిబ్బంది

- ఎంఈఓ, అటవీ అధికారుల ప్రశంసలు
- కుక్కల బారి నుండి జాతీయ పక్షికి విముక్తి..
- ఇల్లందు ఎంపిపిఎస్ పాఠశాల సిబ్బంది సమయస్ఫూర్తి

ఇల్లందు జూన్ 24 (జన సంఘర్షణ)





స్థానిక ఎంపీపీఎస్ పాఠశాలలో బుధవారం ఉదయం ఒక అరుదైన ఘటన చోటుచేసుకుంది. ఉదయం సుమారు 8:30 గంటల ప్రాంతంలో ఒక నెమలి అకస్మాత్తుగా పాఠశాల ఆవరణలోకి వచ్చింది. అదే సమయంలో కొన్ని కుక్కలు ఆ నెమలిని వెంటాడుతూ దాడి చేయడానికి ప్రయత్నించాయి. ఇది గమనించిన పాఠశాల స్కావెంజర్, విద్యార్థులు తక్షణమే సమయస్ఫూర్తితో స్పందించారు. కుక్కల బారి నుండి ఆ నెమలిని సురక్షితంగా రక్షించి, దానికి ఎటువంటి హాని కలగకుండా పాఠశాలలోని వంటగదిలో భద్రపరిచారు. తద్వారా జాతీయ పక్షికి తృటిలో ప్రాణాపాయం తప్పింది. ఈ విషయాన్ని పాఠశాల సిబ్బంది తక్షణమే మండల విద్యాశాఖాధికారి ఉమాశంకర్‌దృష్టికి తీసుకెళ్లారు. ఆయన వెంటనే స్పందించి, అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించారు. అనంతరం పాఠశాలకు చేరుకున్న అటవీ శాఖ అధికారులకు నెమలిని సురక్షితంగా అప్పగించారు. ఈ సందర్భంగా ఉమాశంకర్ మాట్లాడుతూ.. పర్యావరణ సమతుల్యతను కాపాడటంలో వన్యప్రాణులు ఎంతో కీలకమైన పాత్ర పోషిస్తాయని, వాటిని సంరక్షించడం మన అందరి బాధ్యత అని పేర్కొన్నారు. ప్రమాదంలో ఉన్న జాతీయ పక్షిని కాపాడి జీవకారుణ్యాన్ని, సామాజిక బాధ్యతను చాటుకున్న విద్యార్థులను, పాఠశాల సిబ్బందిని ఆయన ప్రత్యేకంగా అభినందించారు. సమాచారం అందుకుని పాఠశాలకు చేరుకున్న జూలూరుపాడు ఖీూా గుగులోత్ తారాసింగ్, ఇల్లందు బీట్ ఆఫీసర్ బాలకృష్ణ నెమలిని స్వాధీనం చేసుకున్నారు. విద్యార్థుల బాధ్యతాయుత ప్రవర్తనను, సిబ్బంది సమయస్ఫూర్తిని అటవీ అధికారులు కొనియాడారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం జాన్ దేవదత్తం, ఉపాధ్యాయులు ఆంగోత్ రమేష్, స్వరూప, కృష్ణ వేణి, సుశీల, సీఆర్పీ శేఖర్, సుమలత తదితరులు పాల్గొన్నారు.

# కాట్రియాల గ్రామంలో బీసీ, ఎస్సీ కమ్యూనిటీ హాలులు మంజూరు

- బోరు మోటర్‌ను ప్రారంభించి గ్రామ ప్రజల ధర్తీ తీర్చేందుకు శ్రీకారం చుట్టారు.

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి జూన్ 24: (జన సంఘర్షణ)



మెదక్ నియోజకవర్గం, రామయంపేట్ మండలం, క్యాట్రియల్ గ్రామంలో మెదక్ శాసనసభ్యుడు డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు పర్యటించారు. ఎంఎస్ఎస్ఓ ఆర్గనైజేషన్ ద్వారా సొంత నిధులతో ఏర్పాటు చేసిన బోర్ మోటార్లను ప్రారంభించి గ్రామ ప్రజల దాహార్తి తీర్చే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. అనంతరం గ్రామంలో నిర్మించిన ఇందిరమ్మ ఇండ్లను లబ్ధిదారులకు అందజేశారు. గ్రామ సర్పంచ్ స్రవంతి రాజేందర్ గుప్తా, వార్డు సభ్యులు, మండల నాయకులు ఎమ్మెల్యేకి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ క్యాట్రియల్ గ్రామానికి ఎంజిఎన్ఆర్ ఈజిఎస్ నిధులు, ఎస్‌డిఎఫ్, బిసి సంఘానికి నిధుల ద్వారా కమ్యూనిటీ హాలు, ఎస్సీ కమ్యూనిటీ హాలు మంజూరు చేయడం జరిగిందని తెలిపారు. గ్రామ అభివృద్ధే తన లక్ష్యమని స్పష్టం చేశారు.

# అభివృద్ధిపై మాట్లాడే ముందు కాంగ్రెస్ ఆత్మపరిశీలన చేసుకోవాలి

- యలమద్ది రవి
- ఇల్లందు ప్రగతి బీఆర్ఎస్ హయాంలోనే సాధ్యమైంది: కాంగ్రెస్ విమర్శలను తిప్పికొట్టిన యలమద్ది రవి
- హామీలు ఏమాయ్యాయి?.. ప్రతిపక్షాలపై విమర్శలు విడనాడి ఇచ్చిన మాట నిలబెట్టుకోండి
- కాంగ్రెస్ నాయకులకు ఎందుకు ఈ ఉలికిపాటు?



ఇల్లందు జూన్ 24 (జన సంఘర్షణ)

ఇల్లందు నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీ నిర్వహించిన కార్యక్రమంలో చేసిన ప్రసంగాలను కాంగ్రెస్ నాయకులు వక్రీకరిస్తూ అనవసర ఆరోపణలు చేయడంపై బీఆర్ఎస్ పార్టీ నాయకుడు యలమద్ది రవి తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ నాయకుల తీరుపై బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ, అధికార పక్ష నాయకులకు ఎందుకు అంత ఉలికిపాటు అని ప్రశ్నించారు. సదరు సభలో ప్రస్తుత ఎమ్మెల్యే "అమ్ముడు పోయారు" అనే వ్యాఖ్య ఎక్కడా చేయలేదని రవి స్పష్టం చేశారు. కేవలం మాజీ ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్ రావు ఇల్లందు నియోజకవర్గానికి చేసిన అపారమైన అభివృద్ధిని, పార్టీ పరంగా ఇచ్చిన గౌరవాన్ని ప్రస్తావిస్తూ పూర్తి రాజకీయ సందర్భంలోనే ఆ వ్యాఖ్యలు చేశారని వివరించారు. నిజానిజాలు తెలుసుకోవడానికి సంబంధిత వీడియోలను పరిశీలించుకోవచ్చని సవాల్ విసిరారు. కాంగ్రెస్ నాయకులు అభివృద్ధి గురించి మాట్లాడే ముందు ఒకసారి ఆత్మపరిశీలన చేసుకోవాలని యలమద్ది రవి హితవు పలికారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత బీఆర్ఎస్ ప్రభుత్వ తొమ్మిదిన్నర సంవత్సరాల హయాంలోనే ఇల్లందు నియోజకవర్గం అన్ని రంగాల్లో ముందంజలో నిలిచిందని, గతంలో ఎన్నడూ లేని విధంగా ఎన్నో శాశ్వత అభివృద్ధి కార్యక్రమాలు ఇక్కడ జరిగాయని గుర్తుచేశారు. బీఆర్ఎస్ పాలనలో ఇల్లందులో నిర్మించిన కూరగాయల మార్కెట్, మినీ స్టేడియం, బస్ డిపో, 100 పడకల ఆసుపత్రి, అంబేద్కర్ భవన్, కొమరం భీమ్ భవన్, బంజారా భవన్ వంటి ఎన్నో భవనాలు ఇందుకు నిదర్శనమన్నారు. అలాగే యుటిలిటీ సెంటర్, స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్, సెంట్రల్ లైటింగ్, అంతర్గత రోడ్లు, గ్రామీణ ప్రాంతాల్లో సీసీ రోడ్లు, పార్కులు, ఇంటింటికీ తాగునీరు, స్మశాన వాటికలు, చెత్త సేకరణ ట్రాక్టర్ల వంటి వసతులను కల్పించినట్లు పేర్కొన్నారు. దశాబ్దాల పాటు ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ పాలన కొనసాగినప్పటికీ ప్రజలకు కనీస సౌకర్యాలు కల్పించడంలో ఎందుకు విఫలమయ్యారో కాంగ్రెస్ నాయకులు సమాధానం చెప్పాలని రవి డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ హయాంలో సాధ్యమైన అభివృద్ధి కార్యక్రమాలు సుదీర్ఘ కాంగ్రెస్ కాలంలో ఎందుకు జరగలేదో ప్రజలకు వివరించాల్సిన బాధ్యత వారిపై ఉందన్నారు. 2018 ఎన్నికల సమయంలో నేటి కాంగ్రెస్ ఎమ్మెల్యే కోరం కనకయ్య కూడా కేసీఆర్ నాయకత్వంలో జరిగిన అభివృద్ధిని చూసే ప్రజలను ఓట్లు అడిగిన విషయాన్ని కాంగ్రెస్ నాయకులు మరువరాదని గుర్తుచేశారు. నేడు తాము భారీ మెజారిటీతో గెలిచామని గొప్పలు చెప్పుకుంటున్న కాంగ్రెస్ నాయకులు, తాము అధికారంలోకి రావడానికి కారణమైన ఎన్నికల హామీలను మాత్రం విస్మరిస్తున్నారని మండిపడ్డారు. ఎన్నికల సమయంలో రైతు భరోసా కింద ఏడాదికి 15,000, కౌలు రైతులకు 12,000, మహిళలకు నెలకు 2,500, కళ్యాణ లక్ష్మి పథకానికి తులం బంగారం, వృద్ధులకు 4,000 పెన్షన్, వికలాంగులకు 6,000 పెన్షన్, ఇంట్లో ఇద్దరికి పెన్షన్, అలాగే ఆడపిల్లలకు స్కూటీలు ఇస్తామని కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన అనేక హామీలను నమ్మే గ్రామీణ ప్రజలు వారికి అధికారం కట్టబెట్టారని రవి పేర్కొన్నారు. అయితే నేటికీ రైతు భరోసా పూర్తి స్థాయిలో అమలు కాలేదని, కౌలు రైతులకు, మహిళలకు ప్రకటించిన ఆర్థిక సహాయం అందలేదని ఆరోపించారు. పెన్షన్ల పెంపు, కళ్యాణ లక్ష్మి తులం బంగారం, స్కూటీల హామీలు అటకెక్కాయని విమర్శించారు. కాబట్టి కాంగ్రెస్ నాయకులు ప్రతిపక్షాలపై విమర్శలు చేయడం మానేసి హామీల అమలుపై దృష్టి పెట్టాలని, ప్రజలు అన్నింటినీ గమనిస్తున్నారని, 2028 ఎన్నికల్లో ప్రజా తీర్పు ఎలా ఉంటుందో ఆలోచించుకోవాలని హెచ్చరించారు.

# ప్రత్యేక ఓటరు జాబితా సవరణకు సహకరిస్తాం

- బీజేపీ నియోజకవర్గ ఇంచార్జీ కుంజా సంతోష్
- రేపటి నుంచే ప్రత్యేక ఓటరు సవరణ కార్యక్రమం.. సబ్ కలెక్టర్ కార్యాలయంలో జాబితా అందజేత
- అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడమే లక్ష్యం: సబ్ కలెక్టర్ ఆఫీస్ వద్ద బీజేపీ నేతల వెల్లడి
- ఓటరు జాబితా సవరణ ప్రక్రియను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి: బీజేపీ నేతల పిలుపు
- భద్రాచలంలో బీజేపీ యాక్టివ్: ఏఈఆర్ఓ రవికుమార్‌కు బూత్ లెవెల్ ఏజెంట్ల జాబితా సమర్పణ

భద్రాచలం జూన్ 24 (జన సంఘర్షణ)

భారత ఎన్నికల సంఘం దేశవ్యాప్తంగా ప్రతిష్టాత్మకంగా నిర్వహించ తలపెట్టిన ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమానికి భద్రాచలంలో కసరత్తులు ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా భారతీయ జనతా పార్టీ (బీజేపీ) నియోజకవర్గ కమిటీ అత్యంత క్రియాశీలకంగా వ్యవహరిస్తూ తమ సన్నద్ధతను చాటుకుంది. జూన్ 25వ తేదీ నుండి అధికారికంగా ప్రారంభం కానున్న ఈ ప్రత్యేక ఓటరు జాబితా సవరణ ప్రక్రియను పురస్కరించుకుని భద్రాచలం నియోజకవర్గానికి సంబంధించిన బూత్ లెవెల్ ఏజెంట్ల (బీఎల్ఏ) జాబితాను బీజేపీ నాయకులు బుధవారం నాడు సిద్ధం చేశారు. సిద్ధం చేసిన పార్టీ బీఎల్ఏల అధికారిక జాబితాను భద్రాచలంలోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో అసిస్టెంట్ ఎలక్షన్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ కోట రవికుమార్‌ని కలిసి నాయకులు అందజేశారు. నియోజకవర్గంలోని అన్ని పోలింగ్ కేంద్రాల పరిధిలో పార్టీ తరపున ప్రతినిధులు అందుబాటులో ఉంటారని ఈ సందర్భంగా తెలియజేశారు.




ఎన్నికల సంఘం చేపట్టే ఈ ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో భాగంగా కొత్త ఓటర్ల నమోదు ప్రక్రియ అత్యంత కీలకంగా సాగనుంది. ముఖ్యంగా 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్క యువతీ యువకుడు తమ పేరును ఓటరుగా నమోదు చేసుకునేందుకు బీజేపీ బీఎల్ఏలు క్షేత్రస్థాయిలో సహకరిస్తారని పేర్కొన్నారు.కొత్తగా ఓట్లు నమోదు చేయడంతో పాటు, ప్రస్తుత ఓటరు జాబితాలో ఉన్న తప్పుల సవరణ, చిరునామా లేదా వివరాల మార్పులు, ఓటరు జాబితాపై వచ్చే అభ్యంతరాల పరిశీలన వంటి అంశాలలో ఎన్నికల అధికారులతో కలిసి తమ పార్టీ ఏజెంట్లు సమన్వయంతో పని చేస్తారని నాయకులు వెల్లడించారు. అర్హులైన ప్రతి పౌరుడి పేరు ఓటరు జాబితాలో నమోదయ్యేలా చూడటమే ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశ్యమని బీజేపీ నేతలు తెలిపారు. క్షేత్రస్థాయిలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా, పారదర్శకంగా ఓటరు జాబితా రూపొందేందుకు పార్టీ నియమించిన బీఎల్ఏల వివరాలను ముందస్తుగానే సమర్పించినట్లు వివరించారు. నియోజకవర్గంలోని ప్రజలు, ముఖ్యంగా యువత ఈ సువర్ణ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పోలింగ్ కేంద్రాల వద్దకు వెళ్లి గానీ, ఆన్‌లైన్ ద్వారా గానీ తమ ఓటరు వివరాలను ఒకసారి సరిచూసుకోవాలని, ఏవైనా లోపాలు ఉంటే వెంటనే సవరించుకోవాలని ఈ సందర్భంగా వారు ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం నియోజకవర్గ బీజేపీ బీఎల్ఏ ఇంచార్జీ కుంజా సంతోష్, బీజేపీ సీనియర్ నాయకులు ములిశెట్టి రాంమోహన్ రావు, అల్లాడి వెంకటేశ్వరరావు, చెల్లుబోయిన వెంకన్న, బోడ సత్యనారాయణ తదితరులు పాల్గొని అసిస్టెంట్ ఎలక్షన్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్‌కు జాబితాను అందజేశారు.

# డి-అడిక్షన్ సెంటర్‌లో బాధితులకు క్యారం, చెస్ బోర్డులు పంపిణీ

- మత్తు వ్యసనానికి దూరంగా ఉండి కొత్త జీవితాన్ని ప్రారంభించాలి.
- నర్సాపూర్ డి-అడిక్షన్ సెంటర్‌ను సందర్శించిన జిల్లా ఎస్పీడి.వి.శ్రీనివాసరావు.

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి జూన్ 24(జన సంఘర్షణ)



మత్తు పదార్థాల వ్యసనం నుంచి బయటపడేందుకు చికిత్స పొందుతున్న వారికి ప్రోత్సాహం అందించేందుకు మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు నర్సాపూర్‌లోని డి-అడిక్షన్ సెంటర్‌ను బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా చికిత్స పొందుతున్న బాధితులతో ఎస్పీ మాట్లాడి వారి ఆరోగ్య పరిస్థితి,చికిత్స పురోగతి గురించి తెలుసుకున్నారు. మత్తు వ్యసనాన్ని పూర్తిగా విడిచిపెట్టి కుటుంబ సభ్యుల అండతో సమాజంలో గౌరవప్రదమైన జీవితాన్ని గడపాలని సూచించారు. మానసిక దృఢత్వం, సంకల్పంతో వ్యసనం నుంచి పూర్తిగా బయటపడవచ్చని, వైద్యులు,కౌన్సిలర్ల సూచనలను తప్పనిసరిగా పాటించాలని తెలిపారు. బాధితుల్లో ఆత్మవిశ్వాసం పెంపొందించేందుకు ఎస్పీ క్యారం బోర్డులు,చెస్ బోర్డులను పంపిణీ చేశారు. అలాగే వారికి స్నాక్స్ అందజేసి ఆప్యాయంగా పలకరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ డ్రగ్స్, ఇతర మత్తు పదార్థాల నిర్మూలనలో ప్రజల భాగస్వామ్యం ఎంతో కీలకమని అన్నారు. పరిసరాల్లో ఎవరైనా మత్తు పదార్థాల విక్రయం లేదా వినియోగానికి పాల్పడుతున్నట్లు తెలిసిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని తెలిపారు. వ్యసనానికి బానిసైన వారికి చికిత్స, కౌన్సిలింగ్ ద్వారా కొత్త జీవితాన్ని అందించడమే పోలీసు శాఖ లక్ష్యమని, అదే సమయంలో మత్తు పదార్థాల అక్రమ రవాణా, విక్రయాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు కొనసాగుతాయని స్పష్టం చేశారు.డ్రగ్స్ రహిత మెదక్ జిల్లా నిర్మాణానికి ప్రతి ఒక్కరూ బాధ్యతగా ముందుకు రావాలని జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మెదక్ డీఎస్పీ ప్రసన్నకుమార్, నర్సాపూర్ ఎస్ఐ రంజిత్ రెడ్డి, డి-అడిక్షన్ సెంటర్ నిర్వాహకులు,వైద్య సిబ్బంది, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# పల్స్ పోలియోను విజయవంతం చేయండి

- జిల్లా వైద్యాధికారి జ్ఞానేశ్వర్.

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి జూన్ 24 (జన సంఘర్షణ)






పల్స్ పోలియోను విజయవంతం చేయాలని జిల్లా వైద్యాధికారి జ్ఞానేశ్వర్ అధికారులకు ఆదేశించారు. బుధవారం మత శిశు సంరక్షణ దవాఖానలో అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య అధికారి జ్ఞానేశ్వర్ మాట్లాడుతూ.. మెదక్ జిల్లా ఈనెల 28న నిర్వహించనున్న పల్స్ పోలియో ఇమ్యునైజేషన్ కార్యక్రమాన్ని అధికారుల సమన్వయంతో పనిచేసి విజయవంతం చేయాలని డిఎం అండ్ హెచ్ ఓ జ్ఞానేశ్వర్ పిలుపునిచ్చారు. పుట్టిన బిడ్డ నుంచి ఐదు సంవత్సరాలలోపు ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు వేయించాలి అని కోరారు. జిల్లాలో 0 నుండి 5 సంవత్సరాల పిల్లలు మొత్తం 75,496 మంది వీరికి 457 బూతులు ఏర్పాటు చేసి మొబైల్ టీంలు ,ట్రాన్సిస్ట్ టీమ్స్, 872 ఏర్పాటు చేసి 1828 మంది ఏఎన్ఎమ్స్ ఆశాలు డాక్టర్లు విధులు నిర్వహించినట్లుగా చేయడం జరిగినది. 125 హైరిస్ ఏరియాను గుర్తించి అందులో 657 చిల్డ్రన్ లను గుర్తించడం జరిగినది. ఈ కార్యక్రమమును అందరూ సద్వినియోగం చేసుకోవాలని ఒక్క పిల్లవాడు కూడా తప్పిపోకుండా 100 శాతం అందరూ పోలియో చుక్కలు వేయించుకోవాలని డి ఎం హెచ్ ఓ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మెడికల్ అధికారులు, ఏఎన్ఎంలు, సూపర్వైజర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# జూన్ 25 నుంచి 'సర్-2026' ఓటరు జాబితా సవరణ షెడ్యూల్

- అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడమే లక్ష్యం.
- బూత్ స్థాయిలో చురుగ్గా కదలాలని బీఆర్ఎస్ శ్రేణులకు పిలుపు.

కొత్తగూడెం జూన్ 24 (జన సంఘర్షణ)



**ఓటరు జాబితా ప్రత్యేక సవరణ**

ప్రజాస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయడంలో ఓటరు నమోదు అత్యంత కీలకమైన బాధ్యత. ఇందులో భాగంగానే జూన్ 25వ తేదీ నుండి 'సర్-2026' ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమం అధికారికంగా ప్రారంభం కానుంది. 18 సంవత్సరాలు నిండిన ప్రతి యువకుడు, యువతి తప్పనిసరిగా ఓటరుగా నమోదు చేసుకొని తమ ఓటు హక్కును పొందేందుకు సిద్ధం కావాలి.

**సవరణలు, మార్పులకు అవకాశం**

ఈ ప్రత్యేక డ్రైవ్‌లో భాగంగా కొత్త ఓటర్ల నమోదు ప్రక్రియ వేగవంతంగా సాగుతుంది. దీనితో పాటు ఓటరు జాబితాలో గతంలో దొర్లిన పొరపాట్ల సవరణ, చిరునామా మార్పులు, అర్హులైన వారి పేర్ల చేర్పులు మరియు తప్పుల తొలగింపు వంటి ముఖ్యమైన అంశాలపై ప్రత్యేక శ్రద్ధ వహించడం జరుగుతుంది.

**కార్యకర్తలకు సుజాతనగర్ బీఆర్ఎస్ అధ్యక్షుల పిలుపు**

సుజాతనగర్ మండల పరిధిలోని ప్రతి పోలింగ్ బూత్‌లో బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు, నాయకులు సైనికుల్లా పనిచేయాలని సుజాతనగర్ మండల కమిటీ అధ్యక్షులు లావుడ్యా సత్యనారాయణ నాయక్ పిలుపునిచ్చారు. అర్హత ఉన్న ఏ ఒక్క పౌరుడి పేరు కూడా ఓటరు జాబితా నుంచి మిస్ కాకుండా క్షేత్రస్థాయిలో విస్తృతంగా కృషి చేయాలని ఆయన కోరారు.

**మన ఓటు - మన భవిష్యత్తు**

బలమైన ఓటరు జాబితాతోనే బలమైన ప్రజాస్వామ్యం సాధ్యమవుతుంది. ప్రతి అర్హుడికి ఓటు హక్కు కల్పించడం ద్వారానే ప్రజాస్వామ్యంలో అందరికీ భాగస్వామ్యం లభిస్తుంది. "మన ఓటు... మన హక్కు - మన భాగస్వామ్యం... మన భవిష్యత్తు" అనే నినాదంతో ఈ ఓటరు నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సత్యనారాయణ నాయక్ పిలుపునిచ్చారు.

# మన ఆరోగ్యం మన భద్రత

- మంబోజిపల్లిలో ఉచిత మెగా వైద్య శిబిరం ఘన విజయం.

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి జూన్ 24 (జన సంఘర్షణ)



ఆర్యోగ విషయంలో చిన్న పొరపాటు రాకుండా చూసుకోవాలని బాధ్యతని లైఫ్ కేర్ సూపర్ స్పెషలిస్ట్ హాస్పిటల్ ఏమర్జెన్సీ మెడిసన్, డైరెక్టర్ డాక్టర్ ముజిబ్ అన్నారు. బుధవారం మెదక్ మండల పరిధిలోని మంబోజిపల్లి గ్రామంలో లైఫ్ కేర్ సూపర్ స్పెషలిస్ట్ హాస్పిటల్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరం విజయవంతంగా జరిగింది. ఈ శిబిరంలో గ్రామ ప్రజలకు నిపుణులైన వైద్యుల పర్యవేక్షణలో వివిధ రకాల ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన మందులను ఉచితంగా పంపిణీ చేశారు. శిబిరంలో న్యూరాలజీ నిపుణులు డాక్టర్ చక్రవర్తి, ఎమర్జెన్సీ మెడిసిన్,డైరెక్టర్ డాక్టర్ ముజీబ్, పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ గౌతమ్, అనస్థీషియా, ఇంటెన్సివిస్ట్ డాక్టర్ శివ, ఫిజీషియన్ డాక్టర్ విష్ణు, గైనకాలజిస్టు డాక్టర్. అంజలి పాల్గొని ప్రజలకు వైద్య సలహాలు అందించారు. శిబిరంలో బీపీ,షుగర్, ఈసీజీ వంటి పలు రకాల వైద్య పరీక్షలను ఉచితంగా నిర్వహించారు. లైఫ్ కేర్ సూపర్ స్పెషలిస్ట్ హాస్పిటల్‌లో కార్డియాలజీ, న్యూరాలజీ, ఆర్థోపెడిక్, పీడియాట్రిక్, గైనకాలజీ, పల్మనాలజీ, జనరల్‌ట్రామా విభాగాల్లో ఆధునిక వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయని నిర్వాహకులు తెలిపారు. అలాగే ఆరోగ్యశ్రీతో పాటు ఈఎస్ఐ, ఈ హెచ్ ఎస్, జె హెచ్ ఎస్ తదితర మెడికల్ రీయింబర్స్‌మెంట్ సదుపాయాలు కూడా ఆసుపత్రిలో అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. ఈ ఉచిత వైద్య శిబిరానికి మంబోజిపల్లి గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై వైద్య సేవలను సద్వినియోగం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మానస రాములు, వార్డ్ సభ్యులు, పంచాయతీ కార్యదర్శి నయీమ్ తదితరులు పాల్గొన్నారు.

# ఆటో డ్రైవర్ మల్లేష్ నిజాయితీని అభినందించిన నరేష్

- రూ.15 వేల నగదు అప్పగింత.. ఆటో డ్రైవర్ మల్లేష్‌కు కృతజ్ఞతలు తెలిపిన నరేష్.

ఇల్లందు జూన్ 24 (జన సంఘర్షణ)

**నగదు పోగొట్టుకుని ఆందోళనలో ఉన్న నరేష్**



ఇల్లందులోని ఒక పెట్రోల్ బంకులో పనిచేస్తున్న ముత్యాల నరేష్ తన నెల రోజుల వేతనం కోసం ఏటీఎం నుండి రూ.15 వేల నగదును డ్రా చేశారు. అయితే, అనుకోకుండా ఆ నగదుతో పాటు ఏటీఎం కార్డు కూడా బంకు ప్రాంగణంలోనే కింద పడిపోయింది. కష్టపడి సంపాదించిన జీతం డబ్బులు పోవడంతో ఏం చేయాలో పాలుపోక మేనేజర్ నరేష్ తీవ్ర ఆందోళనకు గురయ్యారు.

**నిజాయితీ చాటుకున్న ఆటో డ్రైవర్ మల్లేష్**

అదే సమయంలో ఆటోకు డీజిల్ పోయించుకుని బయటకు వస్తున్న ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా (టీయూసీఐ) ఏరియా కమిటీ సభ్యుడు, ఆటో డ్రైవర్ పిల్లి మల్లేష్‌కు ఆ నగదు, ఏటీఎం కార్డు లభించాయి. ఆయన వెంటనే ఆ విషయాన్ని టీయూసీఐ జిల్లా కార్యదర్శి షేక్ యాకూబ్ షా దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం ఇద్దరూ కలిసి పెట్రోల్ బంకు వద్దకు రాగా, అక్కడ డబ్బులు పోగొట్టుకుని ఆవేదన చెందుతున్న నరేష్ వీరిని కలిశారు. సీసీ కెమెరా విజువల్స్ ఆధారంగా ఆ డబ్బు నరేష్ దేనని నిర్ధారించుకున్నాక, మల్లేష్ ఆ మొత్తాన్ని ఆయనకు భద్రంగా అప్పగించారు.

**మల్లేష్ నిజాయితీని అభినందించిన నరేష్**

తన నెల జీతం డబ్బులు తిరిగి దక్కడంతో మేనేజర్ నరేష్ ఎంతో హర్షం వ్యక్తం చేశారు. డబ్బు పోయి తీవ్ర ఆందోళనలో ఉన్న తనకు, రూపాయి కూడా ఆశించకుండా రూపాయిలతో సహా తెచ్చి ఇచ్చిన ఆటో డ్రైవర్ మల్లేష్ నిజాయితీని నరేష్ ప్రత్యేకంగా అభినందిస్తూ, ఆయనకు మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలిపారు. మల్లేష్ ప్రదర్శించిన ఈ గొప్ప గుణాన్ని బంకు సిబ్బందితో పాటు స్థానికులు కూడా ఎంతగానో కొనియాడారు.

## మెదక్ నియోజకవర్గం, రామాయంపేట మండలం, క్యాత్రియల్ గ్రామంలో విస్తృతంగా పర్యటించిన మెదక్ శాసనసభ్యుడు డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి జూన్ 24: (జన సంఘర్షణ)





ఎం ఎస్ ఎస్ ఓ ఆర్గనైజేషన్ ద్వారా సొంత నిధులతో ఏర్పాటు చేసిన బోర్ మోటార్లను ప్రారంభించి గ్రామ ప్రజల దాహార్తి తీర్చే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. అనంతరం గ్రామంలో నిర్మించిన ఇందిరమ్మ ఇండ్లను లబ్ధిదారులకు అందజేశారు. గ్రామ సర్పంచ్, వార్డు సభ్యులు, మండల నాయకులు శాసనసభ్యులకు ఘనంగా స్వాగతం పలికారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు మాట్లాడుతూ.. క్యాత్రియల్ గ్రామానికి ఎంజిఎన్ఆర్ఇజిఎస్ నిధులు ఎస్‌జిఎఫ్, బిసి సంఘానికి నిధుల ద్వారా కమ్యూనిటీ హాలు, ఎస్సీ కమ్యూనిటీ హాలు మంజూరు చేయడం జరిగిందని తెలిపారు. గ్రామ అభివృద్ధే తన లక్ష్యమని స్పష్టం చేశారు.

## పార్టీ బలోపేతానికి గ్రామ గ్రామాన పర్యటనలు చేస్తా

**- మల్లిక అశోక్.**

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి జూన్ 24 (జన సంఘర్షణ)



భారతీయ జనతా పార్టీ (బీజేపీ) బలోపేతానికి గ్రామ గ్రామాన పర్యటిస్తూ పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్తానని మెదక్ జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు మల్లిక అశోక్ అన్నారు. మహిళలకు బీజేపీలో సముచిత స్థానం,గౌరవం లభిస్తుందని ఆమె పేర్కొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ,తనకు మెదక్ జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలిగా అవకాశం కల్పించిన ఎంపీ ఎంపీ రఘునందన్ రావు రాష్ట్ర మీడియా ఇంచార్జ్ చికోటి ప్రవీణ్ కుమార్ మెదక్ జిల్లా అధ్యక్షుడు వల్లదస్ మల్లేష్ గౌడ్ మెదక్ జిల్లా బీజేపీ మాజీ అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్ తో పాటు పార్టీ నాయకులు, కార్యకర్తలకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

## ఆరు గ్యారంటీలతో పేద ప్రజలకు అండగా రాష్ట్ర ప్రభుత్వం

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి జూన్ 24 (జన సంఘర్షణ)



రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరు గ్యారంటీ పథకాల ద్వారా పేద ప్రజలకు అండగా నిలుస్తోందని మెదక్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు హాఫిదుద్దీన్ పేర్కొన్నారు. బుధవారం ఒక్క ప్రకటనలో ఆయన మాట్లాడుతూ.. మహాలక్ష్మి పథకం కింద రాష్ట్రవ్యాప్తంగా 4 కోట్ల 14 లక్షల మంది మహిళలు ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణ సౌకర్యాన్ని వినియోగించు కున్నారని తెలిపారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల్లో ఉద్యోగాల భర్తీకి ప్రాధాన్యత ఇస్తోందని, 15,892 ఖాళీలను భర్తీ చేసే ప్రక్రియ కొనసాగుతోందని చెప్పారు. గృహజ్యోతి పథకం ద్వారా కూడా ప్రజలు పెద్ద ఎత్తున లబ్ధి పొందుతున్నారని పేర్కొన్నారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తోందని ఆఫీసుద్దీన్ తెలిపారు. రాష్ట్ర అభివృద్ధితో పాటు పేద, మధ్యతరగతి కుటుంబాల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన అన్నారు.

## స్టార్ హాస్పిటల్ ప్రారంభించిన స్థానిక సర్పంచ్ బర్ల మధుకర్, డాక్టర్ బాలగంగాధర్ రెడ్డి

కోటగిరి /జూన్ 24/(జన సంఘర్షణ)





నిజామాబాద్ జిల్లా కోటగిరి మండల కేంద్రంలోని అంగడి బజార్ వద్ద స్టార్ హాస్పటల్ ను స్థానిక సర్పంచ్ బర్ల మధుకర్‌తో పాటు వైద్యులు బాలగంగాధర్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లా దుతూ ..మండల కేంద్రంలోని ప్రజలకు వివిధ గ్రామాల ప్రజలకు అందుబాటులో ఉంటూ వైద్య సేవలు అందించుటకు హాస్పటల్ ప్రారంభించడం జరిగిందన్నారు. ప్రతి బుధవారం ఓపి ఉచితంగా చూడబడును అని అన్నారు. షుగరు బీపీ థైరాయిడ్ వంటి వ్యాధులకు పరీక్షలను చేయబడును అని అన్నారు. పక్షవాతం అరిచేతుల అరికాళ్ళ తిమ్మిర్లు మంటలు కీళ్లవాతము, కీళ్ల నొప్పులు, కీళ్ల మరి కండరాలకు సంబంధించిన వ్యాధులకు ఫిట్స్ పెరల్స్ స్ట్రోక్ టైఫాయిడ్ డెంగ్యూ మలేరియా ఇతర రోగాలకు అన్ని రకాల వ్యాధులకు అత్యధిక పద్ధతులతో చికిత్స అందించబడును అని అన్నారు. పాముకాటు గుండె జబ్బు లాంటి వ్యాధులకు సకాలంలో మందులను ఇస్తూ మెరుగైన వైద్యం కొరకు నిజాంబాద్ హాస్పిటల్ తరలించుటకు సహాయ సహకారాలు అందిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ బాల గంగాధర్ రెడ్డి, డాక్టర్ గణేష్, డాక్టర్ వికాస్ రెడ్డి, కే సాయిలు, సర్పంచులు బర్ల మధుకర్, కొర్ర రవి, స్థానిక నాయకులు పుల్లెల మోహన్ రావు, రంగదాసు, చౌదరి గుత్తరంగారావు, ఇవంతరావు పటేల్, జగ్గు పటేల్, వైద్య సిబ్బంది, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఇల్లందులో విత్తనాల మేళాను ప్రారంభించిన మార్కెట్ కమిటీ చైర్మన్ రాంబాబు

ఇల్లందు జూన్ 24 (జన సంఘర్షణ)





ఇల్లందు నియోజకవర్గ శాసనసభ్యులు కోరం కనకయ్య ఆదేశానుసారం మండల పరిధిలోని సుదిమళ్ళ రైతువేదికలో విత్తనాల మేళా కార్యక్రమం ఘనంగా ప్రారంభమైంది. ఇల్లందు మార్కెట్ కమిటీ చైర్మన్ బానోత్ రాంబాబు కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులతో కలిసి విత్తనాల మేళాను సందర్శించి, రిబ్బన్ కట్ చేసి ఈ కార్యక్రమాన్ని అధికారికంగా ప్రారంభించారు.

**రైతు సంక్షేమమే ధ్యేయంగా ప్రజా ప్రభుత్వం**

ప్రస్తుత సాగు సీజన్‌లో రైతుల సౌకర్యార్థం ప్రజా ప్రభుత్వం ఈ విత్తనాల మేళాను ప్రత్యేకంగా ఏర్పాటు చేసింది. ముఖ్యంగా ఎలినో ప్రభావం పట్ల రైతులకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించేందుకు, వ్యవసాయ రంగంలో ఎదురయ్యే సవాళ్లను అధిగమించేందుకు ఈ మేళా ఎంతో దోహదపడుతుందని నిర్వాహకులు పేర్కొన్నారు.

**నకిలీ విత్తనాలకు చెక్**

రైతులను నిలువునా ముంచే నకిలీ విత్తనాలకు అస్సలు తావు లేకుండా, నాణ్యమైన విత్తనాలను రైతులకు అందుబాటులో ఉంచడమే ఈ మేళా ముఖ్య ఉద్దేశం. ప్రభుత్వ నిబంధనల ప్రకారం సర్టిఫైడ్ చేసిన విత్తనాలను మాత్రమే రైతులకు అందిస్తూ, నకిలీల బారిన పడకుండా వ్యవసాయ అధికారులు ఈ సందర్భంగా రైతులకు పలు సూచనలు చేశారు.

**కాంగ్రెస్ నేతలు, ప్రజాప్రతినిధుల హాజరు**

ఎమ్మెల్యే కోరం కనకయ్య పిలుపు మేరకు ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ శ్రేణులు భారీగా తరలివచ్చారు. ఇందులో భాగంగా ఇల్లందు మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మండల రాంమహేష్, ఇల్లందు సొసైటీ చైర్మన్ మెట్ల కృష్ణతో పాటు పలువురు స్థానిక నాయకులు చురుగ్గా పాల్గొన్నారు.

**పాల్గొన్న ముఖ్య నాయకులు, అధికారులు**

ఈ కార్యక్రమంలో సుదిమళ్ళ సర్పంచ్ కుంజా సుగనయ్య, సర్పంచుల సంఘం గౌరవ అధ్యక్షురాలు పాయం స్వాతి, కొమ్ముగూడెం సర్పంచ్ తాటి యశోద, మాజీ సర్పంచ్ కల్తీ పద్మ, మాజీ ఎంపిపి మోకాళ్ళ వెంకటమ్మ హాజరయ్యారు. వీరితో పాటు మాజీ మండల పార్టీ అధ్యక్షులు పులి సైదులు, నాయకులు తాటి భిక్షం, శ్రీను, తిరుపతి, సతీష్, ప్రసన్న, వీరా మరియు అగ్రికల్చర్ ఏవో సతీష్‌తో పాటు పలువురు వ్యవసాయ అధికారులు, కాంగ్రెస్ నేతలు పాల్గొన్నారు.

## మెదక్ జిల్లాలో విద్య సౌకర్యాలను మెరుగుపరచాలి

◆ **జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్.**

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి జూన్ 24 (జన సంఘర్షణ)



జిల్లాలో విద్య సౌకర్యాలు మరింత మెరుగు పడాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అధికారులు ఆదేశించారు. బుధవారం కలెక్టర్ క్యాంప్ ఆఫీస్ నుంచి జిల్లా విద్య అధికారి రాజు, మండల విద్య అధికారులు, స్పెషల్ ఆఫీసర్లు, విద్య అధికారులతో గూగుల్ మీట్ సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా అవకాశాలు మెరుగు కోసం ప్రత్యేక అధికారులను నియమించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ.. జిల్లాలో విద్య సౌకర్యాలు మరింత మెరుగు పరచడం కోసం ప్రత్యేక అధికారులు చొరవ చూపాలన్నారు. ప్రభుత్వ పాఠశాల, కళాశాల , కేజీబీవీ, మోడల్ స్కూల్, యు ఆర్ ఎస్ పాఠశాలల్లో, పెండింగ్ పనులు, మౌలిక వసతుల కోసం నిరంతరం పర్యవేక్షించి సమస్యలను పరిష్కరించి జిల్లాలో నాణ్యత గల విద్యను అందించడం కోసం పాటుపడాలన్నారు .ప్రత్యేక అధికారులు ఇచ్చిన నివేదికల ప్రకారం సమస్యలు ఉన్న ప్రభుత్వం విద్య సంస్థలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## 20 ఏళ్ల తర్వాత సావర్‌గావ్‌కు బస్సు సౌకర్యం

జుక్కల్/జూన్ 24/(జన సంఘర్షణ)









జుక్కల్ కాంగ్రెస్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు ప్రత్యేక చొరవతో జుక్కల్ మండలం సావర్‌గావ్ గ్రామానికి 20 ఏళ్ల తర్వాత కొత్త బస్సు సర్వీస్ ప్రారంభమైంది. బాన్సువాడ డిపోకు చెందిన ఈ బస్సు కండెబలూర్-సావర్‌గావ్-విఠల్‌వాడి మార్గంగా కంగ్టి వరకు సేవలు అందించనుంది. ప్రజాపాలనలో భాగంగా ప్రజలకు అందుతున్న ఈ సౌకర్యంపై గ్రామ ప్రజలు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కి, ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావుకి కృతజ్ఞతలు తెలిపారు.

## చెరువులో పడి మహిళ మృతి

నందిపేట/జూన్ 24/(జన సంఘర్ష ణ)



పూజ చేసిన పూలను నిమజ్జనం చేసేందుకు వెళ్లిన మహిళ ప్రమాదవశాత్తు కాలు జారి చెరువులో పడి మృతి చెందింది. ఎస్సై వినయ్ తెలిపిన వివరాల ప్రకారం.. నందిపేట్ రాంనగర్కు చెందిన సుజాత (50) బుధవారం ఉదయం రఘునాథ చెరువుకు వెళ్లింది. భర్త గంగాధర్ ఇంటికి వచ్చి చూసే సరికి ఆమె కనిపించలేదు. ఆరా తీయగా చెరువులో మృతదేహం లభ్యమైంది. భర్త ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## తుజాల్‌పూర్‌లో ఇందిరమ్మ ఇళ్లు

బీబీపేట్, జూన్ 24 ( జన సంఘర్షణ )



కామారెడ్డి జిల్లా బీబీపేట మండలంలోని తుజల్ పూర్ గ్రామంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టినటువంటి ఇందిరమ్మ ఇళ్లు. తూజల్పూర్ గ్రామంలో పుల్లూరి కనకరాజు అనే వ్యక్తి కి ఈ రోజు నూతన గృహానికి ముగ్గు పోయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఇందిరమ్మ కమిటి సభ్యులు, కార్యకర్తలు, గ్రామ సెక్రెటరీ, తదిపరుల పాల్గొన్నారు.

## "సాక్షి స్టాఫ్ రిపోర్టర్ వేణు కుటుంబాన్ని పరామర్శించిన డీసీసీ అధ్యక్షులు ఏలే మల్లికార్జున్"

కామారెడ్డి,/ జూన్ 24/(జన సంఘర్షణ)







కామారెడ్డి జిల్లా కేంద్రంలోని సాక్షి పత్రిక స్టాఫ్ రిపోర్టర్ వేణు తల్లి ఇటీవల అనారోగ్యంతో కన్నుమూసిన విషయం తెలుసుకున్న కామారెడ్డి జిల్లా డీసీసీ అధ్యక్షులు ఏలే మల్లికార్జున్ కామారెడ్డి పట్టణంలోని వేణు నివాసానికి వెళ్లి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా వేణుతో పాటు వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేసిన ఏలే మల్లికార్జున్ తల్లిని కోల్పోవడం తీరని లోటని పేర్కొన్నారు. ఈ కష్టకాలంలో కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని, ఆ భగవంతుడు వారికి మనోధైర్యాన్ని ప్రసాదించాలని ఆకాంక్షించారు. వేణు తల్లి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించిన ఆయన, వారి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. కుటుంబ సభ్యుల దుఃఖంలో తాను భాగస్వామినని పేర్కొంటూ వారికి ధైర్యం చెప్పారు. ఈ పరామర్శ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, పలువురు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

"బాధలో ఉన్న కుటుంబానికి అండగా నిలవడం మన సామాజిక బాధ్యత" అని డీసీసీ అధ్యక్షులు ఏలే మల్లికార్జున్ పేర్కొన్నారు.

## ముంబై మెట్రో స్టేషన్‌లో రస్సెల్ వైపర్ పాము కలకలం

ముంబై/జూన్ 24/(జన సంఘర్షణ)





ముంబై బాంద్రా కుర్లా కాంప్లెక్స్ మెట్రో స్టేషన్‌లో అత్యంత విషపూరితమైన రస్సెల్ వైపర్ పాము కనిపించడం కలకలం రేపింది. అటవీ శాఖ సిబ్బంది దానిని సురక్షితంగా పట్టుకుని అడవిలో విడిచిపెట్టారు.అటవీ ప్రాంతాలు..గ్రామాలలో కనిపించే రస్సెల్ వైపర్ (రక్త పింజర) పాము ఏకంగా ముంబై మెట్రో రైలు స్టేషన్ ఫ్లాట్ ఫామ్ పై ప్రత్యక్షమవ్వడం కలకలం రేపింది. ఇందుకు సంబంధించిన వీడియో వైరల్‌గా మారింది. నిత్యం ప్రయాణికుల రద్దీతో కనిపించే ముంబై - బాంద్రా కుర్లా కాంప్లెక్స్ మెట్రో లైన్-3 స్టేషన్‌లో అత్యంత విషపూరితమైన రస్సెల్స్ వైపర్ పాము కనిపించింది. బీకేసీ ఆక్వా మెట్రో లైన్ 3 స్టేషన్ బేస్‌మెంట్-2లో రస్సెల్స్ వైపర్ పాము సంచారాన్ని గమనించి సిబ్బంది హడలిపోయారు. పామును గుర్తించిన వెంటనే అప్రమత్తమైన భద్రతా సిబ్బంది పాములను రక్షించే నిపుణులను, అటవీ శాఖకు సమాచారం అందించారు. వెంటనే సంఘటన స్థలానికి చేరుకున్న అటవీ సిబ్బంది, స్నేక్ క్యాచర్ నీరసంగా బేస్మెంట్ పై పాకుతున్న రస్సెల్ వైపర్ ను చూశారు. ఆ పామును సురక్షితంగా బంధించే ముందు దానికి కొంత నీరు ఇచ్చి..నెమ్మదిగా ఓ సీసాలో దానిని బంధించారు. అటవీ శాఖ మార్గదర్శకాల ప్రకారం దాని సహజ ఆవాసంలోకి తిరిగి వదిలివేశారు.

# ప్రతి కార్యకర్తకు ఎల్లప్పుడూ అండగా ఉంటా...

- మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్ రెడ్డి... బాన్సువాడ నియోజకవర్గం ఇంచార్జ్




రుద్రూర్/జూన్ 24/(జన సంఘర్షణ)
బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ఇందూరు చంద్రశేఖర్.. ఆధ్వర్యంలో సర్ పై అవగాహన బుధవారం నిర్వహించారు నిజామాబాద్ జిల్లా రుద్రూర్ మండల కేంద్రంలోని ఫంక్షన్ హాల్ లో బాన్సువాడ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం ఓటరు ప్రత్యేక సమగ్ర సవరణ సర్ పై అవగాహన, బాన్సువాడ నియోజకవర్గ స్థాయి కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్ రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు సర్ ప్రక్రియ పై ప్రత్యేక దృష్టి సారించాలని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రతి కార్యకర్తకు అండగా ఉంటానని వివరించారు. ఎవరు ఎలాంటి ఆందోళన చెందకూడదని తాను ఎప్పుడూ అండగా ఉంటానని. ఏది అవసరమొచ్చిన ఒక ఫోన్ చేస్తే పది నిమిషాల్లో మీ ముందు ఉంటానని ఏనుగు రవీందర్ రెడ్డి కార్యకర్తలకు భరోసా ఇచ్చారు. ఎవరి బెదిరింపులకు భయపడే అవసరం లేదని తమదే ఒరిజినల్ కాంగ్రెస్ పార్టీ అని ఏనుగు వెల్లడించారు. కొన్ని కారణాలవల్ల నియోజకవర్గానికి దూరం కావడంతో కొందరు లేనిపోని ఆరోపణలు చేశారని, దానిని తీవ్రంగా ఖండిస్తున్నానని ఆయన వెల్లడించారు. తాను మొట్ట మొదటిసారిగా బాన్సువాడకు వచ్చినప్పుడు బీర్కూర్ తిమ్మాపూర్ కలియుగ దైవం సాక్షిగా బాన్సువాడ లోనే ఉంటానని మాట ఇచ్చానని ఆ మాట ప్రకారం బాన్సువాడలోనే ఉంటానని ఏనుగు రవీందర్ రెడ్డి కార్యకర్తలకు భరోసానింపారు. బూత్ లెవెల్ లో ప్రతి ఒక్క వారిని ఓటర్ లిస్టులో చేర్పించడానికి కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు కృషి చేయాలని ఏనుగు రవీందర్ రెడ్డి పిలుపునిచ్చారు. రుద్రూర్ గ్రామ చెరువులో కొంతమంది అక్రమార్కులు అక్రమంగా మొరం తవ్వకాలు చేస్తూ సొమ్ము చేసుకుంటున్నారని ఆయన ఆరోపించారు. ప్రకృతిని విచ్ఛిన్నం చేస్తుంటే సంబంధిత అధికారులు సైతం పట్టించుకోవడంలేదని ఆయన అధికారుల పనితీరుపై అసహనం వ్యక్తం చేశారు.. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఇందూరి సునీత చంద్రశేఖర్, ఉప సర్పంచ్ షేక్ నిస్సార్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ఇందూరి చంద్రశేఖర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రవీణ్, వడ్ల నరేష్, వివిధ మండలాల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# నూగురు వ్యసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆర్థిక వితరణ, చేయుత


- ఇర్ప శ్రీనివాసరావు



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, చర్ల మండలం, జూన్ 25(జనసంఘర్షణ):
చర్ల మండలంలోని మారుమూల గ్రామం బక్కచింతల పాడు గ్రామానికి చెందిన వికలాంగుడు ఇడమయ్యకు ఇర్ప శ్రీనివాసరావు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చేయూ తనందించారు. రెండు కాళ్లు కోల్పోయి, చేతులు కూడా సరిగా పనిచేయని పరిస్థి తుల్లో జీవనం సాగిస్తున్న ఇడమయ్య కుటుంబం గురించి తెలిసిన ఇర్ప శ్రీనివాసరావు వ్యవసాయమార్కెట్ కమిటీ చైర్మన్, స్పందించి ఆర్థిక సహాయాన్ని అందించారు.కింటా బియ్యం పది రోజులకు సరిపడా ముడి సరుకులు రూ.2 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. బుధవారం ఇడమయ్య, సుశీల దంపతులకు అందించారు. దాతలు ఎవరైనా ఉంటే నేరుగా స్పందించి సహాయం చేయాలని కోరారు, అలాగే ఇడమయ్యకు వికలాంగుల పింఛన్ మంజూరు కోసం తన వంతు ప్రయత్నం చేస్తానని తెలిపారు. ఇడమయ్య కుటుంబానికి దాతలు సహకారం అందించేందుకు ముందుకు వస్తుండటం అభి నందనీయమని స్థానికులు అన్నారు. ఈ కార్యక్రమంలో, నూగురు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఇర్ప శ్రీనివాసరావు, తుడుం దెబ్బ మండల నాయకులు శ్యామల తరుణ్ తదితరులు పాల్గొన్నారు.

# నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపిన మాజీ డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్ రెడ్డి





కామారెడ్డి జిల్లా బాన్సువాడ/జూన్ 24/(జన సంఘర్షణ)
బాన్సువాడ నియోజకవర్గ పరిధిలో పలు వివాహాది శుభకార్యాలకు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపిన మాజీ డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్ రెడ్డి . కామారెడ్డి జిల్లా కేంద్రంలోని సత్య కన్వెన్షన్ సెంటర్లో ప్రముఖ వ్యాపార వేత్త, బాన్సువాడ పట్టణ వాస్తవ్యులు నాగులగామ వెంకన్న గుప్తా కుమారుడు రతీష్ వివాహ వేడుకకు హాజరై నూతన వధూవరులు రతీష్ – వర్షలను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు బాన్సువాడ పట్టణ శివారులోని ఫంక్షన్ హాల్లో బీర్కూర్ మండలం చించోల్లి గ్రామం జంగం అశోక్ కుమారుడు శివకుమార్ వివాహానికి హాజరై నూతన వధూవరులు శివకుమార్ – హరిణి గార్లను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు బాన్సువాడ పట్టణం జర్నలిస్టు కాలనీలో అక్షర టుడే విలేకరి ప్రచేతన్ నూతన గృహప్రవేశ మహోత్సవానికి హాజరై వారి కుటుంబ సభ్యులకు శు భాకాంక్షలు తెలిపారు ఈ శుభకార్యాలలో పాల్గొన్న బాన్సువాడ పట్టణ ప్రజాప్రతినిధులు, నాయకులు.

# అర్ధరాత్రి పోలీసుల రహస్య పూజలు.. స్టేషన్ లో మేక బలి!

చెన్నై/జూన్ 24/(జన సంఘర్షణ)
తమిళనాడులోని సేలం జిల్లా ఓమలూరు సమీపంలో ఉన్న తీవట్టిపట్టి పోలీస్ స్టేషన్లో చోటుచేసుకున్న ఒక వింత ఘటన స్థానికంగా తీవ్ర చర్చకు దారి తీసింది. పోలీస్ స్టేషన్ పరిధిలో నేరాలను తగ్గించడం కోసమంటూ.. పోలీసులు అర్ధరాత్రి దాటిన తర్వాత రహస్యంగా మేకను బలి ఇచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించడం వెలుగులోకి వచ్చింది.తివట్టిపట్టి పోలీస్ స్టేషన్లో ప్రస్తుతం ఇన్స్పెక్టర్ పోస్టు ఖాళీగా ఉంది. ఈ నేపథ్యంలో, సబ్–ఇన్స్పెక్టర్లు, కొందరు సిబ్బంది కలిసి ఆదివారం అర్ధరాత్రి నుంచి సోమవారం వేకువ జాము వరకు పోలీసు స్టేషన్లో రహస్యంగా పూజలు నిర్వహించారు. ఒక మేకను బలి ఇచ్చి, దాని రక్తాన్ని పోలీస్ స్టేషన్ ముఖద్వారం వద్ద చల్లారు.రక్షణ కల్పించాల్సిన పోలీస్ స్టేషన్లోనే ఇలా జంతు బలి ఇవ్వడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవడంతో, ఈ వ్యవహారంపై పోలీస్ ఉన్నతాధికారులు తీవ్రంగా స్పందించారు. ఈ ఘటనపై ఉన్నతాధికారుల విచారణకు ఆదేశాలు జారీ అయ్యాయి. ఇటీవల కాలంగా పోలీసు స్టేషన్ పరిధిలో నేరాలు ఎక్కువగా జరుగుతుండటం, తమకు విశ్రాంతి, సెలవులు కూడా లేకుండా ఉక్కిరి బిక్కిరి అయ్యేపరిస్థితి ఉండటంతోనే ఈ పూజలలో లీనమైనట్టుగా అక్కడి సిబ్బంది వాపోవడం గమనార్హం.




# ఇంటింటా గాయత్రి యజ్ఞాలు నిర్వహించాలి

- జిల్లా సమన్వయకర్త డా. సతీష్ ఖండేల్వాల్.
- ఇల్లందులో ఘనంగా గాయత్రి జయంతి వేడుకలు.. లోకకళ్యాణార్థం ప్రత్యేక యజ్ఞం



ఇల్లందు జూన్ 24 (జన సంఘర్షణ)
ఇల్లందులో గాయత్రి జయంతి వేడుకలు అఖిల విశ్వ గాయత్రి పరివార్ ఇల్లందు శాఖ ఆధ్వర్యంలో గాయత్రి జయంతి వేడుకలను అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఇల్లందు ఆమ్ బజార్ లోని గాయత్రి పరివార్ పాదుకా పీఠంలో ఈ ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ఇందులో భాగంగా మొదటిరోజు నిన్న భక్తులు, సాధకులు కలిసి 24 సార్లు భక్తిశ్రద్ధలతో గాయత్రి చాలీసా పఠనము చేశారు.

**లోకకళ్యాణార్థం గాయత్రి యజ్ఞం**

వేడుకలలో భాగంగా ఈరోజు లోక కళ్యాణాన్ని కాంక్షిస్తూ ప్రకృతి సమతుల్యత కోసం ప్రత్యేకంగా గాయత్రి యజ్ఞము నిర్వహించారు. ప్రస్తుతం పెరుగుతున్న వాతావరణ కాలుష్య నివారణను దృష్టిలో ఉంచుకుని, వాతావరణాన్ని పరిశుభ్రం చేసే ప్రత్యేక ద్రవ్యాలతో యజ్ఞ గుండంలో శాస్త్రోక్తంగా ఆహుతులు సమర్పించారు.

**ఇంటింటా యజ్ఞాలు నిర్వహించాలి**

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన గాయత్రి పరివార్ జిల్లా సమన్వయకర్త డాక్టర్ సతీష్ ఖండేల్వాల్ మాట్లాడుతూ.. అఖండ దీపము, మాతాజీ, గురుదేవుల సాధన శతజయంతి ఉత్సవాలలో భాగంగా ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. సమాజ శ్రేయస్సు కోసం ఇంటింటా గాయత్రి యజ్ఞము, సంస్కారములు, గాయత్రి చాలీసా పఠనం, దీప యజ్ఞాలు నిర్వహించాలని, ఇందుకు ప్రతి కార్యకర్త చొరవ తీసుకుని సహకరించాలని కోరారు.

**సన్నిధానం సత్యనారాయణకు సత్కారం**

యజ్ఞ కార్యక్రమం దిగ్విజయంగా పూర్తయిన అనంతరం, పరివ్రజక్ సన్నిధానం సత్యనారాయణని నిర్వాహకులు శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ ఆధ్యాత్మిక కార్యక్రమంలో గాయత్రి పరివార్ ముఖ్య కార్యకర్తలు, సాధకులు, భక్తులు, పెద్ద సంఖ్యలో అభిమానులు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

# పాఠశాలకు వచ్చిన మొసలి..విద్యార్థులు లేక తప్పిన ప్రమాదం!



గుజరాత్/జూన్ 24/(జన సంఘర్షణ)
గుజరాత్‌లోని ఓ పాఠశాల ఆవరణలోకి 10 అడుగుల భారీ మొసలి ప్రవేశించడం కలకలం రేపింది. విద్యార్థులు లేని సమయంలో ఘటన జరగడంతో ప్రమాదం తప్పగా, అధికారులు మొసలిని సురక్షితంగా తరలించారు. జలాశయాలలో ఉండాల్సిన ఓ భారీ మొసలి ఒకటి..ఏకంగా పాఠశాల ప్రాంగణంలో ప్రవేశించి అందరిని భయపెట్టింది. ఇందుకు సంబంధించిన వీడియో వైరల్ గా మారింది. గుజరాత్ రాష్ట్రం గిర్ సోమనాథ్ జిల్లాలోని వేరావల్ తాలూకాలో బదల్‌పారా గ్రామంలోని ఓ పాఠశాల ఆవరణలో ఒక భారీ మొసలి ప్రవేశించింది. అది రాత్రి సమయంలో దర్జాగా రోడ్డు మార్గంలో నడుచుకుంటూ..మెల్లగా పాఠశాల ఆవరణలో వాలిబాల్ కోర్టు మీదుగా స్కూల్ బస్సు, తరగతి గదుల సమీపంలోకి వెళ్లడం వీడియోలో కనిపించింది. మొసలిని గమనించిన స్థానికులు భయాందోళనకు గురయ్యారు. 8 నుండి 10 అడుగుల పొడవున్న ఆ మొసలి పాఠశాల మైదానంలో సంచరిస్తుండటాన్ని స్థానికులు గమనించి ఆ దృశ్యాన్ని తమ మొబైల్ ఫోన్లలో చిత్రీకరించగా, ఆ వీడియోలు ఇప్పుడు సోషల్ మీడియాలో విస్తృతంగా వైరల్ అవుతున్నాయి. మొసలి విద్యార్థులు, సిబ్బంది లేని సమయం రాత్రి వేళ పాఠశాల ఆవరణలోకి రావడంతో ఎలాంటి ప్రమాదం జరుగలేదని స్థానికులు వెల్లడించారు. మొసలి సంచారం సమాచారం అందుకున్న అధికారులు దానిని బంధించి నీటి వనరులలో విడిచి పెట్టారని సమాచారం. గుజరాత్‌లో నీటి వనరుల సమీపంలోని మానవ నివాస ప్రాంతాల్లోకి ఈ మొసళ్లు అప్పుడప్పుడు ఆహారాన్ని వెతుక్కుంటూ ప్రవేశిస్తుంటాయని స్థానికులు చెబుతున్నారు. మొసలి పాఠశాల మైదానం ప్రవేశం వీడియో చూసిన నెటిజన్లు..దానికి నీళ్లలో ఉండి బోర్ కొట్టినట్లుందని, అందుకే ఆహారాన్ని వెతికే క్రమంలో సమీప జనావాసంలోకి ప్రవేశించి ఉంటుందని కామెంట్ చేశారు.

# రైతు ఆశీర్వాద సభను జయప్రదం చేయండి..

- సింగరేణి మండల కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు సమావేశంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు..



24.06.2026 ఖమ్మం జిల్లా వైరా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు సింగరేణి మండల కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులతో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 30న చింతకాని మండలంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొననున్న రైతు ఆశీర్వాద సభను విజయవంతం చేయాలని కోరారు. ఈ సభావేదికగా రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అన్నదాతలకు రైతు భరోసా నిధులు సీఎం రేవంత్ రెడ్డి గారు విడుదల చేస్తారని తెలిపారు. మన ఖమ్మం జిల్లా నుంచి విడుదల చేయడం మన జిల్లాకు గర్వకారణం అని అన్నారు .రైతు సోదరులు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమును జయప్రదం చేయాలని కోరారు. అదే విధంగా జనసమీకరణ కు గ్రామాలు వారీగా ఇంచార్జ్ లను నియమిస్తామని అన్నారు.

జన సంఘర్షణ
మా లక్ష్యం సామాన్యుని పక్షం
తెలుగు దినపత్రిక
గురువారం
25 జూన్ 2026

# దళితుల్లో ఉన్న దౌర్భాగ్యం ఏమిటంటే దళితులకు దళితుల శత్రువులు

రుద్రూర్/జూన్ 24/(జన సంఘర్షణ)



ఒక దళితుడికి ఇంకొక వేరే వారితో కమిట్మెంట్ అయి కోవటు అయి తోటి దళితునికి చంపడానికి కొట్టడానికి దేనికైనా వెనకాడని ఘోరాతి ఘోరమైన గుణాలు కొంతమంది దళితుల్లో ఉండడం చాలా అవివేకం. దళితుల్లో వారి స్వార్థం కోసం ఎవరినైనా కొడతారో కోవర్ట్ అవుతారు. ఇతర వారితో కమిట్మెంట్ అయి దేనికైనా తెగించి వేరే వారి అంటే దళిత కులంలో ఎవరైనా అభివృద్ధి చెందుతే వారిని అడగడానికి వెఫన్గా మారుతారు తోటి దళితులు కొంతమంది. నాడు డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ కూడా కొంతమంది దళితుడే మోసం చేశారు అనేది నాడు దళితుడిగా పుట్టినందుకు ఆయన ఎంత బాధపడ్డారు. దళితుల్లోనే కొంతమంది ఆయనకు మోసం చేసిన వైనం బట్టి బాధపడిన రోజులు ఉన్నాయనిది చర్చ. ఇక ఇప్పుడైతే తోటి దళితున్ని అనగా తొక్కడం కోసం ఎంతకైనా తగిస్తారు కొంతమంది దళితులు అనేది చర్చ. ఈ పరిస్థితి రుద్రూరు అక్బర్ నగర్ లో ఉందని అనడంలో అతిశక్తి లేదని చర్చ. రౌడీ సీటర్ చేసిన ఘనత రెండుసార్లు కొట్టించిన ఘనత కొంతమంది దళితులు కోవటై ఈ విధమైన పరిస్థితి తెచ్చిన కొంతమంది దళితులు ఈ విధమైన కొవ్వొట్టు మారి తోటి దళితులపై కొట్టించిన హత్యాయత్నం చేయించిన అక్రమ కేసులు చేయించిన వైనం రుద్రూరు అక్బర్ నగర్ గ్రామాల్లో ఉండడం అవివేకం అంటూ పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్న వైనం జరుగుతుందని చర్చ. అందుకే కాబోలు జైశ్రీరామ్ సలాం వాలేకుం రామ్ అనే పదం అందంగా ఉంటుందని కొంతమంది చర్చ చేసుకుంటూ ఉండగా జై భీమ్ అంటే భయంగా ఉందని కొంతమంది అనుకుంటూ ఉండగా ఎందుకంటే జై భీమ్ అంటే దళితులు కొంతమంది కోవర్టుగా మారి ఎంతకైనా తెగిస్తున్నారని భయంతో జై భీమ్ అనడానికి వెనుకంజ వేస్తున్నారని చర్చ. అందుకే కాబోలు జై భీమ్ కు బదులు జైశ్రీరామ్ సలాం వాలేకుం అనే పదాలతో ముందుకు వెళుతున్నారని చర్చ.

# ఫెర్టిలైజర్ యాప్‌ను వెంటనే రద్దు చేయాలి

◆ **బిఆర్ఎస్ పార్టీ చర్ల**


భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, చర్ల మండలం, జూన్ 24(జనసంఘర్షణ):



చర్ల బిఆర్ఎస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో మండల కన్వీనర్ దొడ్డి తాతరావు మాట్లాడుతూ.. ఫెర్టిలైజర్ యాప్ ను వెంటనే రద్దు చేయాలని రైతులను తీవ్రంగా కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేస్తుంది అని దొడ్డి తాతారావు విమర్శించారు. ఏన్నికల ముందు రైతులు పండించిన వరి ధాన్యం ఆఖరి గింజ వరకు కొనుగోలు చేస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం కొనుగోలు చేయవద్దని చెబుతుందని రైతులను ఆందోళన గురిచేస్తోంది అదేవిధంగా 7 రకాల విత్తనాలు పండిస్తేనె బోనస్ ఇస్తామని చెప్పడం దారుణమని ఈ విదానం వలన రైతులు చాలా నష్టపోయే అవకాశం ఎక్కువగా ఉంది ఇప్పటికే రైతు బంధు రైతు బీమా రాక రైతులు చాల నష్ట పోయారు రైతుని రాజు చేస్తామని. చెప్పిన ప్రభుత్వం రైతుకు నష్టం చేసే ప్రణాళికలు తయారు చేస్తుంది ఎన్నికల్లో ఇచ్చిన హామీలు చేసే పనులకు పొంతనలేదు. రైతులకు కావాల్సినంత యూరియా ఇవ్వాలేక కొత్తగా యూరియా యాప్ ను తీసుకొచ్చింది గిరిజన రైతుల దగ్గర యాప్ ఓపెన్ చేసే పెద్ద ఫోన్ లు ఉండవు రైతు యాప్ ఓపెన్ చేసిన వారికి మాత్రమే యూరియా ఓపెన్ చేయడం రాని వారికి యూరియా కష్టాలు తప్పవు రైతులు యూరియా యాప్ ఓపెన్ చేసే సరికి స్టాక్ అయిపోయింది, అని చెప్పుతారు అప్పుడు రైతు పరిస్థితి ఏంటి గ్రామలలో ఫోన్ సిగ్నల్స్ ఉండవు అప్పుడు ఏలా యూరియా బుక్ చేసుకోగలరు. ఈ విధానం వలన రైతులు చిక్కులో పడె ప్రమాదం ఉంది కాబట్టి గతంలో వలె ఎటువంటి షరతులు లేకుండా యూరియా రైతులకు అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు సయ్యద్ అజీజ్, పంజా రాజు, కాకి అనిల్, తడికల బుల్లబ్బాయి, గోరెంట్ల వెంకటేశ్వరరావు, కారం కన్నారావు, ఆంబోజి సతీష్, గాదశెట్టి కిషోర్, కుక్కడపు సాయి సృజన్, తదితరులు పాల్గొన్నారు.

# చెరువులో మునిగి గొర్రెల కాపరి మృతి

ఆలూరు/జూన్ 24/(జన సంఘర్షణ)



చెరువులో దిగి స్నానం చేస్తూ ఓ గొర్రెల కాపరి ప్రమాదవశాత్తు నీట మునిగి మృతి చెందిన ఘటన ఆలూరు మండలం మచ్చర్లలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన గణేశ్ సోలంకి (39) నిన్న మధ్యాహ్నం గొర్రెలు కాయడానికి స్థానిక చెరువు వద్దకు వెళ్లాడు. స్నానం చేయడం కోసం చెరువులోకి దిగిన అతడు, నీటి లోతు ఎక్కువగా ఉండటం ఈత రాకపోవడంతో మునిగిపోయాడు. బుధవారం ఆయన మృతదేహం బయటపడింది.

## పోతంగల్ మండల ఉప సర్పంచ్ పోరం అధ్యక్షునిగా గులాం నబీ ఏకగ్రీవ ఎన్నిక

పోతంగల్ /జూన్ 24 /(జన సంఘర్షణ)



నిజామాబాద్ జిల్లా పోతంగల్ మండల కేంద్రంలో మంగళ వారం రోజున నూతనంగా ఎన్నికైన ఉప సర్పంచ్ లు అందరు కలిసి సమావేశం నిర్వహించి ఏక గ్రీవంగా పోరం ఎన్నిక చేసుకున్నారు. మండల అభివృద్ధికి గ్రామాల అభివృద్ధికి వారు మరింత ఉపయోగపడాలని గ్రామ సర్పంచ్ కు వేతనం 6500 ఎంతయితే ఉందో ఉప సర్పంచ్ కు కూడా కనీస వేతనం 5000 అన్న ప్రకటించాలి. ఇవ్వాలి. చెక్ పవర్ పై వస్తున్న వార్తలను ప్రభుత్వం వెంటనే ఖండించాలి. చెక్ పవర్ పై ఉపసర్పంచులకు హక్కు ఇవ్వాలి అని తెలంగాణ ప్రభుత్వానికి డిమాండ్ చేస్తూ ఈనెల 25 వ తేదీన ధర్నా చౌక్ ఇందిరాపార్క్ హైదరాబాద్‌లో జరుగుతున్న భారీ బహిరంగ సభలో ప్రభుత్వానికి డిమాండ్ లు వినిపిస్తాము అని ఆకాంక్షిస్తూ ఫోరం అధ్యక్షుడు గులాం నబీ, ఉపాధ్యక్షుడు హాట్కర్ సతీష్, కార్యదర్శి మైత్రీ హౌసాజీ, కోశాధికారి కవిత చంద్రకాంత్, ఈ కార్యక్రమంలో బీమ్ రావ్,గణేష్, దశరథ్, రాజు పటేల్, తదితరులు పాల్గొన్నారు.

# తన నివాసంలో ఘనంగా విజయ్ శాంతి 60వ జన్మదిన వేడుకలు

హైదరాబాద్/జూన్ 24/(జన సంఘర్షణ)



లేడీ సింగం తెలంగాణ రాష్ట్ర ఎంఎల్సీ, ఉద్యమం నాయక్రాలు తల్లి తెలంగాణ పార్టీ ఫౌండర్ ప్రెసిడెంట్, తన గుండె చేసపుడు ఎప్పుడు జనమే తన ఆశయము ఎల్లప్పుడు జానహితమే విజయ్ శాంతి 60వ జన్మ దిన వేడుకలు ఈ రోజు తన నివాసము జూబ్లీహిల్స్ లో ఘనంగా నిరహించారు. ఈ జన్మ దిన వేడుకలో పాలుగోన్నా సీనియర్ కాంగ్రెస్, సినీ రంగ లేడీ శివంగి.. తెలంగాణ రాష్ట్ర శాసనమండలి సభ్యురాలు ఆత్మీయ అక్క మన అందరి రాములమ్మ.. విజయశాంతికి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను.. భవిష్యత్‌లో ఇంక మరి ఎన్నో ఆనందకరమైన పుట్టిన రోజు వేడుకలు జరుపుకోవాలి అని మనసారా కోరుకుంటున్నాను. చింతల నిర్మల గోవర్ధన్ రెడ్డి తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ మహిళ వైస్ ప్రెసిడెంట్ తదితరులు పాల్గొన్నారు.

# మర్రి చెట్టును ఢీకోట్టిన లారీ ఘోర ప్రమాదం

◆ **భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, చర్ల మండలం, జూన్ 24(జనసంఘర్షణ):



చర్ల మండలంలో మర్రిచెట్టును ఢీకొట్టిన లారీ, క్యాబిన్‌లో ఇరుక్కుపోయిన డ్రైవర్. చర్ల దేవరపల్లి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలం దేవరపల్లి గ్రామంలో బుధవారం ఒక ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. వేగంగా వచ్చిన ఒక అశోక్ లేలాండ్ లారీ రోడ్డు పక్కనే ఉన్న మర్రిచెట్టును బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదం ఏ విధంగా జరిగిందనే దానికి సంబంధించిన పూర్తి వివరాలు ఇంకా తెలియరాలేదు.

**క్యాబిన్‌లో ఇరుక్కుపోయిన డ్రైవర్..**

మర్రిచెట్టును బలంగా ఢీకొట్టడంతో లారీ ముందుభాగం,క్యాబిన్ పూర్తిగా నలిగిపోయింది. ఈ ప్రమాదంలో లారీ డ్రైవర్ మహేష్ క్యాబిన్ లోపలే ఇరుక్కుపోయాడు. అతనికి తీవ్ర రక్తస్రావం కావడంతో పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది.

**రెస్క్యూ ఆపరేషన్‌లో గ్రామస్తులు**

ప్రమాదం జరిగిన వెంటనే స్పందించిన దేవరపల్లి గ్రామస్తులు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. నలిగిపోయిన క్యాబిన్ నుంచి మహేష్‌ను బయటకు తీసేందుకు జెసిబిలు, ట్రాక్టర్ల సహాయంతో తీవ్రంగా శ్రమిస్తున్నారు. ప్రాణాలతో అతడిని కాపాడేందుకు స్థానికులు శతవిధాలా ప్రయత్నిస్తున్నారు.

# భూక్య కమలమ్మకు ఘన నివాళి



వైరా నియోజకవర్గం సిపిఎం పార్టీ ఇన్చార్జ్ భూక్య వీరభద్రం తల్లి భూక్య కమలమ్మ ఇటీవలే స్వర్గస్తులైనారు. ఈరోజు వారి టదశదినఊ పెద్దకర్మ కార్యక్రమంలో పాల్గొని వారి చిత్రపటానికి పూలు వేసి ఘన నివాళులర్పించి వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలుపుతూ కుటుంబ సభ్యులకు మనోధైర్యాన్ని కల్పిస్తూ సంతాపం ప్రకటించినకాంగ్రెస్ పార్టీ నాయకురాలు బానోత్ విజయ బాయి.

## నిజామాబాద్ ఎస్సై ఖాకీ యూనిఫాంలో సైకిల్ ప్రయాణం: సామాజిక బాధ్యతకు నిదర్శనం


నిజామాబాద్/జూన్ 24/(జన సంఘర్షణ)



నిజామాబాద్ జిల్లాలో సామాజిక బాధ్యతకు ప్రతీకగా నిలిచిన ఒక సంఘటన ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. నిజామాబాద్ రూరల్ ఎస్సై తన ఖాకీ యూనిఫాంలో సైకిల్పై పోలీస్టేషన్కు వెళ్తున్న వీడియో సోషల్మీడియాలో విపరీతంగా చక్కర్లు కొడుతోంది. ఈ ఘటన నెటిజన్లను విశేషంగా ఆకట్టుకుంది. సాధారణంగా విధులపై వాహనాల్లో వెళ్లే ఇతర పోలీసుల మాదిరి కాకుండా, ఎస్సై సైకిల్ను ఎంచుకోవడం ప్రత్యేకతను సంతరించుకుంది. సామాజిక కార్యకర్తల అభిప్రాయం ప్రకారం, ఈ చర్య ఆరోగ్య పరిరక్షణతో పాటు పర్యావరణహిత రవాణా పట్ల ప్రజలలో అవగాహన పెంపొందించాలనే సందేశాన్ని ఇస్తోంది.

## హాస్టల్ బాత్రూంలో యువతికి ప్రసవం.. శిశువు మృతి

హైదరాబాద్ గోల్కొండ/జూన్ 24/(జన సంఘర్షణ)



హైదరాబాద్లోని గోల్కొండ పోలీసు స్టేషన్ పరిధిలో ఓ హాస్టల్ వాష్రూమ్లో యువతి ప్రసవించింది. వాష్రూమ్ వెంటిలేటర్ నుంచి విసిరేయడంతో నవజాత శిశువు మృతి చెందింది. ప్రస్తుతం యువతి నిలోఫర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. నవజాత శిశువు మృతదేహాన్ని పోలీసులు ఆసుపత్రికి తరలించారు. హాస్టల్ సిబ్బంది యువతి గర్భం విషయం తమకు తెలియదని చెబుతున్నారు. పోలీసులు ఘటనపై పూర్తి వివరాలు సేకరిస్తున్నారు. యువతి తన బావ కారణంగా గర్భం దాల్చి ఉండవచ్చని కుటుంబ సభ్యులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

## 50 వేల లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన ఎస్సై

హైదరాబాద్ గాంధీనగర్/జూన్ 24/(జన సంఘర్షణ)






పోలీస్ స్టేషన్ బెయిల్ భవిష్యత్తులో ఎలాంటి కేసులు పెట్టకుండా ఉండేందుకు కేసు నమోదైన వ్యక్తి నుంచి రూ.50 వేల లంచం తీసుకుంటూ ఎస్సై ఏసీబీకి పట్టుబడ్డారు. గాంధీనగర్ పోలీస్ స్టేషన్ లో ఎస్సైగా పని చేస్తున్న నర్సింలు మంగళవారం ఓ వ్యక్తి నుంచి రూ.50 వేలు లంచం తీసుకుంటుండగా అవినీతి నిరోధక శాఖాధికారులు రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు. గాంధీనగర్ పోలీస్ స్టేషన్ లో నమోదైన ఓ కేసు విషయంలో ఎస్సై నర్సింలు స్టేషన్ బెయిల్ ఇవ్వడంతో పాటు భవిష్యత్తులో ఎలాంటి కేసులు పెట్టి వేదించకుండా ఉండాలంటే లక్ష రూపాయల లంచం ఇవ్వాలని డిమాండ్ చేశారు. దానితో బాధితుడు ఏసీబీని ఆశ్రయించారు. మొదటి విడతలో రూ.50 వేల లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు నర్సింలును రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు. అనంతరం గాంధీనగర్ పోలీస్ స్టేషన్ లో సోదాలు నిర్వహించారు. నర్సింలు పై కేసు నమోదు చేసి ఏసీబీ కోర్టులో హాజరుపర్చగా రిమాండ్ కు తరలించారు.

## ఆ విద్యుత్ శాఖ అధికారులు కానీ జిపి అధికారులు కానీ పట్టించుకోలేదు

◆ **అనేక నెలలు అవుతుంది పని చేయలేని పరిస్థితిలో పస్తులు ఉంటున్నాం**

రుద్రూర్ అక్బర్ నగర్/జూన్ 24/(జన సంఘర్షణ)



జిపి అధికారులు కరెంట్ అధికారులు కరెంట్ స్తంభం ఎక్కి పనిచేయమంటే పోతే విద్యుత్ షాక్కు గురై గాయాల పాలైన ఆసుపత్రి శిక్షకు డబ్బులు ఇవ్వలే.రాయల పాలన తన శరీరం ప్రస్తుతం పని చేయని పరిస్థితిలో ఉంది. ఆయన తనను ఆదుకోవడంలో విద్యుత్ శాఖ అధికారులు కానీ జిపి అధికారులు కానీ ముందుకు రాలే నా పరిస్థితి ఎలా నా కుటుంబం పరిస్థితి ఎలా తన కుటుంబం రోడ్డుకు వచ్చింది ఆదుకునేది ఎవరు. ఎవరు కూడా సహాయ సహకారాలు అందించకపోతే నా పరిస్థితి ఏంది. బాతుడు మల్లెపూల సాయిలు, అక్బర్ నగర్ గ్రామం, రుద్రూరు మండలం కరెంట్ పని ప్రైవేట్ గా చేస్తూ జీవనం కొనసాగిస్తాడు. ఆయన గోడు ఈ విధంగా ఉంది.

# బూత్ లెవెల్ ఏజెంట్లు పార్టీ భవిష్యత్తుకు కీలకం:నిరంజన్ రెడ్డి



**వనపర్తి :**
ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను పార్టీ నాయ కులు, కార్యకర్తలు ప్రతిష్టాత్మకంగా తీసుకుని విజయవంతం చేయాలని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి పిలుపునిచ్చారు. జిల్లా పార్టీ అధ్యక్షుడు గట్టు యాదవ్ అధ్యక్షతన జిల్లా పార్టీ కార్యాలయంలో నిర్వహించిన బూత్ లెవెల్ ఏజెంట్ల శిక్షణా కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు.మూడు నెలల పాటు కొనసాగే ఎస్ఐఆర్ కార్యక్రమంలో మొదటి నెల అత్యంత కీలకమని, బూత్ లెవెల్ ఏజెంట్లతో పాటు నాయకులు, కార్యకర్తలు కూడా చురుకుగా పాల్గొనాలని సూచించారు. ఓటర్ల జాబితా సవరణతో పాటు ప్రజా సమస్యలను గుర్తించి పార్టీ దృష్టికి తీసుకురావాలని కోరారు.ఈ సందర్భంగా నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ, బూత్ లెవెల్ ఏజెంట్లు పార్టీకి వెన్నెముకలాంటివారని, ఓటర్ల జాబితా సవరణలో అప్రమత్తంగా వ్యవహరించాలని అన్నారు. ప్రతి బూత్లో పార్టీ కార్యకలాపాలను పర్యవేక్షిస్తూ ప్రజలకు సంబంధించిన సమాచారం పార్టీకి అందుబాటులో ఉంచాలని సూచించారు.రాష్ట్ర కార్యదర్శి మెట్టు శ్రీనివాస్ మాట్లాడుతూ, ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని పార్టీ శ్రేణులు అత్యంత ప్రాధాన్యంతో చేపట్టాలని అన్నారు. అర్హులైన ఓటర్ల హక్కులను కాపాడటంలో బూత్ లెవెల్ ఏజెంట్ల పాత్ర కీలకమని పేర్కొన్నారు. జూలై 31 నుంచి ఆగస్టు 30 వరకు అభ్యంతరాల స్వీకరణ, ఆగస్టు 30 నుంచి సెప్టెంబర్ 25 వరకు విచారణ ప్రక్రియ జరుగుతుందని వివరించారు.ఈ సమావేశంలో గట్టు యాదవ్, బి. లక్ష్మయ్య, వాకిటి శ్రీధర్, పలుస రమేష్ గౌడ్, జగదీశ్వర్ రెడ్డి, నందిమల్ల అశోక్, కృష్ణా నాయక్, రఘుపతి రెడ్డి, కర్రె స్వామి, వనం రాములు, దిలీప్ రెడ్డి, మాణిక్యం, బాలరాజు, వేణు యాదవ్ తదితర ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# కుప్పగండ్లలో విత్తన మేళా నిర్వహణ

**సన్న వడ్లు,ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులకు అవగాహన**




**కల్వకుర్తి :**
కల్వకుర్తి నియోజకవర్గంలోని కుప్పగండ్ల గ్రామ రైతు వేదికలో సోమవారం విత్తన మేళా కార్యక్ర మాన్ని నిర్వహించారు. ఈ సం దర్భంగా వ్యవసాయ విస్తరణ అధికారి హబీబున్నిసా రైతులకు ప్రభుత్వం ప్రోత్సహిస్తున్న సన్న రకాల వరి విత్తనాలపై అవగా హన కల్పించారు. ఆర్ఎన్ఆర్-15048, బిపిటి-5204, డబ్ల్యూజీఎల్-44, కేఎన్ఎం-1637, కేఎన్ఎం-7715, హెచ్ఎంటీ సోనా తదితర సన్న వడ్ల రకాల విశేషాలను రైతులకు వివరించారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితులు, భారత వాతావరణ శాఖ హెచ్చరికల దృష్ట్యా వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉన్నందున రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.వర్షాభావాన్ని తట్టుకునే కందులు, మినుములు, పెసర్లు, చిరుధాన్యాలు వంటి ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయడం ద్వారా నష్టాలను తగ్గించుకోవచ్చని తెలిపారు. అలాగే నానో యూరియా, నానో డీఏపీ ఎరువుల వినియోగం వల్ల కలిగే ప్రయోజనాలను రైతులకు వివరించారు.ప్రభుత్వ సూచనలను పాటిస్తూ పంటల సాగుకు ముందస్తు ప్రణాళిక రూపొందించుకోవాలని హబీబున్నిసా, గ్రామ సర్పంచ్ మొక్తాల రమేష్, మెగావత్ శ్రీనివాసులు రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సీడ్ డీలర్లు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని మహిళ మృతి..

**-గుర్తించాలని పోలీసుల విజ్ఞప్తి**



**ధర్మసాగర్ :**
ధర్మసాగరం మండల పరిధిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ మృతి చెందిన గుర్తుతెలియని మహిళను గుర్తించేందుకు పోలీసులు ప్రజల సహకారం కోరుతున్నారు.రాంపూర్ గ్రామ శివారులోని రంగసముద్రం చెరువు సమీపంలో జాతీయ రహదారి-163పై గుర్తుతెలియని వాహనం మహిళను ఢీకొట్టి పరారైంది. తీవ్ర గాయాలపాలైన ఆమెను స్థానికులు, 108 సిబ్బంది వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మహిళ మృతి చెందింది.మృతురాలు సుమారు 55 సంవత్సరాల వయస్సు, 5.5 అడుగుల ఎత్తు కలిగి ఉంది. ఆకుపచ్చ రంగు చీర, లేత ఆకుపచ్చ రంగు జాకెట్ ధరించి ఉంది. ఆమె భిక్షాటన చేసే మహిళగా కనిపిస్తున్నట్లు పోలీసులు అనుమానం వ్యక్తం చేశారు.ఈ మహిళను ఎవరైనా గుర్తించినా, ఆమె కుటుంబ సభ్యులు లేదా బంధువుల వివరాలు తెలిసినా వెంటనే ఈ నంబర్లకు ఫోన్ చేసి 8712685010, 8712675127 ధర్మసాగర్ పోలీసులను సంప్రదించాలని కోరారు. మృతదేహం ప్రస్తుతం వరంగల్ ఎంజీఎం ఆస్పత్రి మార్చురీలో భద్రపరిచి ఉంచినట్లు తెలిపారు.

# బృందావన్ కాలనీలో రూ.54 లక్షలతో సీసీ రోడ్డు పనులు ప్రారంభం



**ఉప్పల్ :**
ఉప్పల్ డివిజన్ పరిధిలోని బృందావన్ కాల నీలో రూ.54 లక్షల వ్యయంతో సీసీ రోడ్డు నిర్మా ణ పనులు ప్రారంభమయ్యాయి. కాలనీలో రహ దారుల సమస్యలను స్థానికులు మాజీ కార్పొ రేటర్ రజిత పరమేశ్వర్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా, ఆమె స్పందించి సంబంధిత అధికారులతో మాట్లాడి పనులు ప్రారంభమయ్యేలా చర్యలు చేపట్టారు.బుధవారం మాజీ కార్పొరేటర్ రజిత పరమేశ్వర్ రెడ్డి నిర్మాణ పనులను పరిశీలించి, పనులు నాణ్యతతో పూర్తి చేయాలని అధికారులకు సూచిం చారు. కాలనీవాసుల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలు కొనసా గుతాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో కేటీఆర్ నగర్ అధ్యక్షుడు హనుమంత్ రెడ్డి, జనార్దన్ రెడ్డి, బృందావన్ కాలనీ అధ్యక్షుడు కాంతారావు, ఉపాధ్యక్షుడు పవన్ కుమా ర్‌తో పాటు స్థానిక నాయకులు, కాలనీ ప్రతినిధులు, మహిళలు, యువకులు మరియు పెద్ద సంఖ్యలో కాలనీవాసులు పాల్గొన్నారు. సీసీ రోడ్డు పనులు ప్రారంభం కావడంతో స్థానికులు ఆనందం వ్యక్తం చేశారు.

# విద్యుత్ ప్రైవేట్ కరణ కోసమే రైతు డిస్కం

**సిఐటియు రాష్ట్ర కార్యదర్శి రాగుల రమేష్**




**హనుమకొండ/ప్రజావారధి:**
రాష్ట్రంలో విద్యుత్ రంగంలో డిస్కాంలను ప్రైవేటీకరించే సన్నాహాలు వేగవంతమవుతున్నా యని, విద్యుత్తు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున ప్రజలు కార్మికులు రైతులు ఉద్యమించాలని సిఐటియు రాష్ట్ర కార్యదర్శి రాగుల రమేష్ పిలుపునిచ్చారు బుధవారం హనుమకొండలోని సుందరయ్య భవన్ లో టీ ఉప్పలయ్య అధ్యక్షతన సిఐటియు వ్యవసాయ కార్మిక సంఘం రైతు సంఘాల జిల్లా ఆఫీస్ బేరర్స్ సమావేశం నిర్వహించరు.. ఈ సమావేశంలో పాల్గొన్న సిఐటియు రాష్ట్ర కార్యదర్శి రాగుల రమేష్ మాట్లాడుతూ కొత్తగా రైతు డిస్కాం ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందనీ దీంతో క్రాస్ సబ్సిడీ రద్దై ప్రజలపై విద్యుత్ భారాలు పడనున్నాయని, స్మార్ట్ మీటర్లు రానున్నాయని దీంతో సామాన్య రైతులు ప్రజలు చిరు వ్యాపారులు విద్యుత్ బిల్లులు కట్టలేక ఇబ్బందులు ఎదుర్కొంటారని ఆయన అన్నారు...కేంద్ర బిజెపి ప్రభుత్వం విద్యుత్ రంగంలో తీసుకొచ్చే విధానాలనే రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేసేందుకు సన్నద్ధమవుతున్నది. వీటి ఫలితంగా తెలంగాణలో రైతాంగంతో పాటు, చిరు వ్యాపారులు, చిన్న, మధ్యతరహా పరిశ్రమల యాజమాన్యాలు, కార్మికులు మరియు సాధారణ వినియోగదారులు తీవ్ర ప్రభావానికి గురికానున్నారని, ఈ ప్రమాదాన్ని ప్రజలకు వివరించి విద్యుత్ సంస్కరణలను వెనక్కి కొట్టేందుకు విస్తృత స్థాయిలో ప్రజా ఉద్యమానికి కార్యాచరణ మూడు సంఘాల ఆధ్వర్యంలో రూపొందిస్తున్నట్లు ఆయన తెలిపారు కార్మికులు, రైతులు, వ్యవసాయ కూలీలు, వినియోగదారులతో విశాల ఉద్యమానికి సన్నద్ధం కావాలనీ పిలుపునిచ్చారు..హనుమకొండ జిల్లాలో జూన్ 30 నుండి జూలై 11 వరకు మండల స్థాయిలో సెమినార్లు సదస్సులు కరపత్ర ప్రచారం, జులై నాలుగున జిల్లా కేంద్రంలో జిల్లా సదస్సు, జులై 10న ఎస్సీ ఆఫీసు ముందు ధర్నా నిర్వహిస్తున్నట్లు రమేష్ తెలిపారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల విద్యుత్ ప్రైవేటీకరణ విధానాలకు వ్యతిరేకంగా యావత్ ప్రజానీకం ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గుమ్మడి రాజుల రాములు, సిఐటియు జిల్లా ఆఫీస్ బేరర్స్ బోట్ల చక్రపాణి, పుల్ల అశోక్, బరుపట్ల మహేష్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఆఫీస్ బేరర్స్ మంద సుచందర్ లోకిని స్వరూప రజిత అజ్మీర బిక్షపతి అంబాలస్వరూప మందుల శ్రీనివాస్, రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఎం చుక్కయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఉచిత సామూహిక వివాహాలు

- పైలెట్ ప్రాజెక్టుగా మొదటి అడుగు విజయవంతం
- శివానంద గురు కల్చరల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 31 జంటలకు సామూహిక వివాహాలు
- దంపతులకు బంగారు పుస్తెలు, వెండి మట్టెలు, పెళ్లి పట్టు వస్త్రాలతో పాటు సత్యనారాయణ వ్రతాలు
- ముఖ్య అతిథులుగా ములుగు డిప్యూటీ కలెక్టర్ మహేందర్ జీ,





**హనుమకొండ :**
శివానంద గురు కల్చరల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పేద ప్రజలకు ఉచిత సామూహిక వివాహాలు చేయాలనే లక్ష్యంతో ఒక పైలట్ ప్రాజెక్టుగా పెట్టుకుంది. అందులో భాగంగానే బుధవారం వరంగల్ ములుగు రోడ్డు లోని శివానంద గురు కల్చరల్ ట్రస్ట్, సద్గురు శ్రీశ్రీశ్రీ శివానందమూర్తి దివ్య సన్నిధి సప్త ధామంలో ఉచిత సామూహిక వివాహాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని శివానంద గురు కల్చరల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్ట్ త్రిపురనేని గోపీచంద్ ఆధ్వర్యంలో నిరుపేద కుటుంబాలకు చెందిన 31 జంటలకు ఉచిత సామూహిక వివాహాలు జరిపించారు.ఈ ఉచిత సామూహిక వివాహాల్లో 31 జంటలకు శివానంద గురు కల్చరల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బంగారు పుస్తెలు, వెండి మట్టలు, పట్టు వస్త్రాలతో పాటు సత్యనారాయణ స్వామి వ్రతం చేయించి కళ్యాణం జరిపించడం జరిగింది. ఉచిత సామూహిక వివాహాలలో 31 జంటల్లో 5 జంటలు హరిజనులు వరంగల్ వారు,19 జంటలు భద్రాద్రి కొత్తగూడెం నుండి అడవి ప్రాంతంలో నివసించే గిరిజన కొయ్య జాతికి చెందినవారు, 7 జంటలు నర్సంపేట కొత్తగూడ ప్రాంతానికి చెందిన గిరిజనులు ఈ సామూహిక ఉచిత వివాహాలలో పాల్గొని కళ్యాణం చేసుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ములుగు అదనపు కలెక్టర్ మహేందర్ జీ, నేషనల్ నవ వికాస ప్రశాంత జాతీయ అధ్యక్షులు రామ్ చంద్రయ్య పాల్గొని కొత్త దంపతులను అక్షంతలు వేసి ఆశీర్వదించారు. ఈ సందర్భంగా శివానంద గురు కల్చరల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్ట్ త్రిపురనేని గోపీచంద్ మాట్లాడుతూ.. నాగరికతకు, సమాజానికి దూరంగా ఉండి పెళ్లి అంటేనే తెలియని అడవి ప్రాంత కొండ కొయ్య గిరిజన ప్రజలకు తెలియపరిచే విధంగా వారికి అన్ని విధాల సహాయ సహకారాలు అందించి ఈరోజు శివానంద గురు కల్చరల్ ట్రస్టు ఆధ్వర్యంలో 31 జంటలకు బంగారపుస్తలు వెండిమట్టలు పట్టు వస్త్రాలు అందించి ఘనంగా కళ్యాణం జరిపించడం జరిగింది. స్వయంగా వారిని దగ్గరుండి ట్రస్టు అన్ని ఖర్చులు పెట్టి మరి ఈరోజు ఇంత పెద్దగా కళ్యాణం నిర్వహించడం చాలా గొప్ప విషయమని అన్నారు. ఇంత మంచి కార్యక్రమం చేపట్టడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఒక పైలెట్ ప్రాజెక్టు గా శివానంద గురు కల్చరల్ ట్రస్టు లక్ష్యంగా పెట్టుకుని పదివేల పదహారు జంటలకు పెళ్లిళ్లు చేయాలనే లక్ష్యంతో ఈరోజు వరంగల్ లో 31 జంటలకు ఉచిత సామూహిక వివరాలు జరిపించి వారి బంధువులకు భద్రాద్రి కొత్తగూడెం నుండి వచ్చిన 300 మందికి వరంగల్ నుండి వచ్చిన 1000 మందికి ఈ కళ్యాణంలో అన్ని వసతులు ఏర్పాటు చేసి విందు భోజనం కల్పించడం జరిగింది. అనంతరం నూతన దంపతులకు కుంకుమ బొట్టుపెట్టి పండ్లు, ఫలాలు, నగదుతో పాటు సారే పోసి లక్ష్మీదేవిగా ఆరాధించడం జరిగింది. ఇలా చేయడం వల్ల లక్ష్మీదేవి కరుణ కటాక్షాలు కలుగుతాయని పురాణాల్లో పేర్కొన్నారని అదే రీతిలో ఈరోజు ఈ సామూహిక వివాహాల్లో చేయడం జరిగిందని అన్నారు. ఈ ట్రస్టు ప్రారంభించి 30 సంవత్సరాల కాలంలో ఇప్పటివరకు 800 జంటలకు సత్యనారాయణ వ్రతాలు, 1000 జంటలకు వరలక్ష్మీ వ్రతాలు ఈ ట్రస్టు ద్వారా జరిపించడం జరిగిందని తెలిపారు. సమ సమాజంలో సాంప్రదాయ ప్రకారం ప్రతి జంట ఇలాంటి కార్యక్రమాలు జరిపించి ఆదర్శంగా నిలవాలని లక్ష్యంతో ఈరోజు ఈ ఉచిత సామూహిక వివాహాలు జరిపించడం జరిగిందని తెలిపారు.

# ఈ నెల 27న మెగా జాబ్ మేళా

- 100 పైగా ప్రముఖ సంస్థలు పాల్గొంటున్నాయి
- నిరుద్యోగ యువతీ యువకులు సద్వినియోగం చేసుకోవాలి
- మాజీ ఎమ్మెల్సీ కపిలవాయి దిలీప్ కుమార్




**హనుమకొండ :**
జూన్ 27న తెలంగాణ రాష్ట్రీయ లోక్ దళ్ ఆధ్వర్యంలో మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు తెలంగాణ రాష్ట్రీయ లోక్ దళ్ రాష్ట్ర అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్సీ కపిలవాయి దిలీప్ కుమార్ తెలిపారు.బుధవారం హనుమకొండ ప్రెస్ క్లబ్లో తెలంగాణ రాష్ట్రీయ లోక్ దళ్ (టి.ఆర్.ఎల్.డి) ఆధ్వర్యంలో పత్రికా విలేకరుల సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కపిలవాయి దిలీప్ కుమార్ మాట్లాడుతూ..హనుమకొండలోని కిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో కేంద్ర నైపుణ్యాభివృద్ధి మరియు వ్యవసాయాధారిత వ్యవస్థాపకత మంత్రిత్వ శాఖ (Ministry of Skill Development & Entrepreneurship) మరియు నేషనల్ స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ (NSDC) ఆధ్వర్యంలో మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ జాబ్ మేళాలో ఐటీ, ఫార్మాస్యూటికల్స్, ఆటోమొబైల్, హెల్త్కేర్, బ్యాంకింగ్ తదితర రంగాలకు చెందిన 100కు పైగా ప్రముఖ సంస్థలు పాల్గొంటున్నాయని తెలిపారు. జూన్ 27న శనివారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు వాక్-ఇన్ ఇంటర్వ్యూలు నిర్వహించబడతాయని, వరంగల్ మరియు పరిసర జిల్లాల నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ జాబ్ మేళాలో పాల్గొనడానికి ఎటువంటి రుసుము లేదని తెలిపారు.ఈ కార్యక్రమాన్ని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి మరియు మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి శ్రీమతి దనసరి అనసూయ (సీతక్క), వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు కడియం కావ్య, ఎమ్మెల్సీ చింతపండు నవీన్ కుమార్ (తీన్మార్ మల్లన్న), మాజీ ఎమ్మెల్సీ ప్రొఫెసర్ వెంకటనారాయణ, మాజీ పార్లమెంట్ సభ్యులు కెప్టెన్ లక్ష్మీకాంతరావు, వర్ధన్నపేట ఎమ్మెల్యే కె. నాగరాజు, ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి తదితర ప్రముఖులు పాల్గొని ప్రారంభించనున్నట్లు తెలిపారు. అదేవిధంగా, అవినీతి రహిత సమాజ నిర్మాణ లక్ష్యంతో "లక్ష్యం కోసం లక్ష సైన్యం" కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమం ద్వారా రిటైర్డ్ ఆర్మీ అధికారులు, మాజీ సైనికులు మరియు దేశభక్తి భావాలు కలిగిన యువతను సమీకరించి సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు తెలిపారు.తెలంగాణ రాష్ట్రీయ లోక్ దళ్ అధికార ప్రతినిధి బీరప్ప మాట్లాడుతూ, రానున్న నల్గొండ- వరంగల్ ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గ ఎన్నికల్లో తెలంగాణ రాష్ట్రీయ లోక్ దళ్ తరపున కపిలవాయి దిలీప్ కుమార్ పోటీ చేయనున్నట్లు ప్రకటించారు. గతంలో ఆయన విజయానికి సహకరించిన భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ), భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) (సీపీఎం), భారత జాతీయ కాంగ్రెస్, తెలుగు దేశం పార్టీ (టీడీపీ) మరియు భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) పార్టీలకు కృతజ్ఞతలు తెలియజేస్తూ, రానున్న ఎన్నికల్లో కూడా ఆయా రాజకీయ పార్టీల సహకారం మరియు మద్దతు కోరుతున్నట్లు తెలిపారు.ఈ సమావేశంలో టీఆర్ఎల్డీ వరంగల్ జిల్లా అధ్యక్షులు రాంప్రసాద్, టీఆర్ఎల్డీ యువజన విభాగం అధ్యక్షులు రాజ్ కుమార్ రెడ్డి, టీఆర్ఎల్డీ సాంస్కృతిక విభాగం అధ్యక్షులు బుల్లెట్ వెంకన్న, టీఆర్ఎల్డీ రాష్ట్ర కోశాధికారి గిరి కుందే, రాష్ట్ర కార్యదర్శి కోటి, ప్రధాన కార్యదర్శి నరసింహారావు తదితర టీఆర్ఎల్డీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. వివరాల కోసం గడ్డం రాంప్రసాద్ వరంగల్ జిల్లా అధ్యక్షులు తెలంగాణ రాష్ట్రీయ లోక్ దళ్ 91 8978907134,Coordinators: 1. 2 - 9542632975,2. బుల్లెట్ వెంకన్న - 9640503757 సంప్రదించాలని కోరారు.

Printed, published and owned by Rachamallu Madhavi Printed at Kranthi Printing Press, 42/603/1/1-a, Mj Colony, Street no 5, Mjcolony, Moulali Secundrabad, and Published from h.no: 10-10-117/150, Nayi brahmana colony, Neerugonda Hanuman road, Nagaram Nizamabad (m&d) 503001, Telangana, Editor : Rachamallu Madhavi.
RNI Reg No :tel/2024/89323, Cell 6305026524, Email:janasangarshana@gmail.co